


RNI NO.TGTEL/25/A5224

# జోర్దార్

JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక

అవినీతి అంతం - మా పంతం




కరీంనగర్ సంపుటి : 01 సంచిక : 271 ఆదివారం, అక్టోబర్ 18 2026, పేజీలు - 8 వెల : 2/- epaper.jordar.com

# జోర్దార్ కథనం దెబ్బకు
# కదిలిన ఉన్నతాధికారులు

- పెద్దపల్లి కలెక్టరేట్ లో ప్రకంపనలు!
- పెద్దపల్లి జిల్లా సంక్షేమ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి పెత్తనంపై రాష్ట్రస్థాయి విచారణ




**పెద్దపల్లి జోర్దార్ ప్రతినిధి**
జోర్దార్ తెలుగు దినపత్రికలో అక్టోబర్ 7వ తేదీన ప్రచురితమైన "జిల్లా సంక్షేమ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి పెత్తనమా?" అనే పరిశోధనాత్మక కథనం పెద్ద దుమారం రేపింది. ఆ కథనానికి రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టరేట్ తక్షణమే స్పందించింది.

**ఏం జరిగింది? జోర్దార్ బయటపెట్టిన అసలు గుట్టు:**
పెద్దపల్లి జిల్లా సంక్షేమ కార్యాలయంలో రామగుండం ×జణూ ప్రాజెక్టు పేరుతో నియమించబడిన ఒక అవుట్ సోర్సింగ్ ఉద్యోగి, జిల్లా కార్యాలయంలోనే తిష్టవేసి అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల నియామకాల్లో అక్రమ జోక్యం చేసుకుంటూ, పెత్తనం చెలాయిస్తున్నారని జోర్దార్ తన కథనంలో సంచలన నిజాలను బయటపెట్టింది.

**రాష్ట్ర స్థాయి నుండి విచారణకు ఆదేశం:**
జోర్దార్ కథనాన్ని సీరియస్ గా తీసుకున్న హైదరాబాద్ లోని మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయం, సంచలన ఆదేశాలు జారీ చేసింది.మెమో నెం. 365/చీచీవీ/2018, తేదీ: 15-10-2026 ద్వారా జాయింట్ డైరెక్టర్ (స్కీమ్స్) గారు పెద్ద పల్లి జిల్లా సంక్షేమ అధికారి (఑ఋూ) కి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు."జోర్దార్ దినపత్రికలో వచ్చిన ఆరోపణలపై వాస్తవాలను నిగ్గు తేల్చండి. వివరణాత్మక వాస్తవ నివేదిక మరియు తీసుకున్న చర్యల నివేదికను వెంటనే పంపండి" అని ఆ మెమోలో పేర్కొన్నారు.

**వరంగల్ =జీణ కి కూడా బాధ్యత:**
ఈ వ్యవహారాన్ని ఇంతటితో వదలకుండా, వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ (=జీణ) కి కూడా కాపీ పంపి, ఈ విచారణను పర్యవేక్షించి తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**జోర్దార్ పోరాటానికి తొలి విజయం:**
అంగన్వాడీ ఉద్యోగాల నియామకాల్లో పేద మహిళలకు అన్యాయం జరుగుతోందని, అక్రమాలు జరుగుతున్నాయని జోర్దార్ నిరంతరం ప్రశ్నిస్తూ వస్తోంది. ఈ కథనం ఆ పోరాటంలో తొలి విజయంగా భావిస్తున్నారు. రాష్ట్రస్థాయి అధికారులు స్పందించడంతో పెద్దపల్లి జిల్లా సంక్షేమ శాఖలో ఇప్పుడు ప్రకంపనలు మొదలయ్యాయి.

# 'బీజేపీ డైవర్షన్ పాలిటిక్స్‌కు
# అలవాటు పడింది



**హైదరాబాద్ :**హైదరాబాద్, అక్టోబర్ 17: బీజేపీ డైవర్షన్ పాలిటిక్స్‌కు అలవాటు పడిందని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. (శనివారం) మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. బీజేపీ విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రతిసారీ విదేశీ శక్తులను తెరపైకి తెస్తోందని మండిపడ్డారు. చైనా భూ ఆక్రమణపై మాట్లాడే దమ్ము మోదీకి లేదన్నారు. రోహింగ్యాల పేరుతో దేశ ప్రజల ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. దొరికితే దొంగ అన్నట్లుంది బీజేపీ తీరు అంటూ మండిపడ్డారు. ఈడీ దాడులు కేవలం ప్రతిపక్ష పార్టీ నేతలపైనే ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నించారు. ఎన్నిక పక్రియ నిబంధనలను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఎందుకు మార్చారని, కమిటీలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌ను ఎందుకు తొలగిం చారని పీసీసీ చీఫ్ నిలదీశారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా జ్ఞానేష్ కుమార్ ఎన్నికైన రోజే ప్రమాదాన్ని గురించి రాహుల్ గాంధీ హెచ్చరిం చారని గుర్తుచేశారు. 'మీరు ప్రజల మద్దతుతో గెలవలేరు.. అందుకే ఓటు దొంగతనానికి పాల్పడ్డారు' అంటూ బీజేపీపై విరుచుకుపడ్డారు. పెద్ద రాష్ట్రాలలో ఓట్ల దొంగతనం ఎక్కువగా జరుగుతోందని అన్నారు.గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో సీపీఎం మద్దతు ఇస్తుందని ఆశిస్తున్నామని మహేశ్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌తో సీపీఎం కలసి పనిచేస్తోందని చెప్పారు. నేటి సీపీఎం పొలిట్‌బ్యూరో మీటింగ్ తర్వాత వారి నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటిస్తారన్నారు. ఇండియా కూటమిలోని అన్ని పార్టీల మద్దతు కూడగడతామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై
# ఉక్కుపాదం




**హైదరాబాద్, అక్టోబరు 17 :** మాదక ద్రవ్యాల నిరోధానికి ఎన్నో చర్యలు తీసుకున్నామని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యానించా రు. మాదక ద్రవ్యాలపై ఉక్కు పాదం మోపు తున్నామని పేర్కొన్నారు. 2029 డిసెంబర్ 31వ తేదీలోగా డ్రగ్స్ రహిత దేశంగా మార్చా లని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. అందుకోసం ఎన్నో కార్య క్రమా లు, వ్యూహాలను మనం చూడ బోతు న్నామని తెలిపారు. డ్రగ్స్ హానికరమని.. ఇవి దేశవ్యా ప్తంగా విస్తరిస్తున్నాయని పేర్కొ న్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని యువ తకు డీజీపీ పిలుపునిచ్చారు. రాష్ట్రీయ ఏక్తా దివస్--2026 సందర్భంగా (శనివారం) ఈగల్ ఫోర్స్ ఆధ్వర్య ంలో జాతీయ మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహిం చారు. తెలంగాణలో మాదకద్రవ్యాల నిర్మూలన, డ్రగ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీజీపీ సీవీ ఆనంద్ హాజరై, ప్రసంగించారు. ఆరు రోజుల క్రితం వివిధ రాష్ట్రాల్లో ఈ ర్యాలీ ప్రారంభమైందని వెల్లడించారు. ఈ ర్యాలీలో ఐదు రాష్ట్రాల వారు పాల్గొన్నారని అన్నారు.

# తెలంగాణ ప్రభుత్వ ఐటిఐలలో
# బోధన పూర్తిగా నిర్వీర్యం

- పర్యవేక్షణ శూన్యం
- నైపుణ్యం లేదు - ఉపాధి లేదు - 60కి పైగా ప్రభుత్వ శిక్షణా సంస్థల్లో విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో




**(హైదరాబాద్ జోర్దార్ ప్రతినిధి)**

**1. శిక్షణ సంస్థల్లో జరుగుతున్న తూతూ మంత్రపు బోధన:**
తెలంగాణ రాష్ట్రంలో సుమారు 60కి పైగా ప్రభుత్వ ఐటిఐలు మరియు మరో 40 అధునాతన శిక్షణా కేంద్రాలు ఉన్నాయి. ఈ సంస్థల్లో శిక్షణ కార్యక్రమాలు, ప్రయోగశాల పనులు నామమాత్రంగా, తూతూ మంత్రంగా జరుగుతున్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు గత రెండు మూడేళ్లుగా పూర్తి నిర్లక్ష్యం వహించడం వల్ల ఐటిఐ చదివిన విద్యార్థులకు ఎవరికీ ఉపాధి దొరకడం లేదు.

**2. బోధించాల్సిన అంశాలు గాలికి - సిలబస్ పూర్తిగా అసంపూర్ణం:**
ప్రభుత్వ ఐటిఐలలో ప్రతిరోజు వృత్తి సిద్ధాంతం మరియు ప్రయోగాలు బోధించాలి. వృత్తి గణితం, ఉపాధి నైపుణ్యాలు, సాంకేతిక చిత్రలేఖనం కూడా ప్రతి వృత్తికి బోధించాలి. ప్రతి పాఠంతో పాటు ప్రయోగశాలలో పనులు కూడా చేయించాలి.
కానీ రాష్ట్రంలో ఉన్న 60కి పైగా ప్రభుత్వ సంస్థల్లో సకాలంలో వృత్తి సిద్ధాంతం, ప్రయోగశాల పనుల బోధన అంతంత మాత్రంగానే ఉంటోంది. వృత్తి గణితం చెప్పాల్సి ఉండగా చాలా మంది శ్రద్ధ వహించడం లేదు. సాంకేతిక చిత్రలేఖన పాఠాలు కూడా అరకొరగానే సాగుతున్నాయి.

**3. పోస్టులు ఉన్నాయి - పర్యవేక్షణ లేదు - 75 శాతం కళాశాలల్లో ఇదే తీరు:**
ప్రతి ఐటిఐలోనూ వేర్వేరు స్థాయిల్లో ప్రభుత్వం పోస్టులను మంజూరు చేసింది. శిక్షణ సహాయకుడు, సహాయ శిక్షణ అధికారి, ఉప శిక్షణ అధికారి వంటి పోస్టుల్లో ఉన్నవారు పాఠ్యప్రణాళికను బోధిస్తున్నారా? సిద్ధాంతం, ప్రయోగాలు చెబుతున్నారా? లేదా? అని శిక్షణ అధికారులు లేదా ప్రధానాచార్యులు పర్యవేక్షించాలి. కానీ 75 శాతం కళాశాలల్లో అలా జరగడం లేదు.ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రభుత్వ కళాశాలల్లో ప్రతి నెలకు, రెండు నెలలకు ఒకసారి మండల స్థాయి, జిల్లా స్థాయి విద్యాధికారులు తిరుగుతూ పాఠాలు జరిగాయా లేదా అని చూస్తారు. కానీ ప్రభుత్వ ఐటిఐలలో పాఠ్యప్రణాళిక సరిగా పూర్తి కావడం లేదు.

**4. సిబ్బంది రాకపోకలకే సమయం - ప్రధానాచార్యుల నిస్సహాయత:**
75 శాతం ప్రభుత్వ ఐటిఐలలో బోధన సిబ్బంది రాకపోకలకే సమయం సరిపోతోంది. ప్రధానాచార్యులు కూడా కొన్నిసార్లు సిబ్బంది వేధింపుల వల్ల ఏమీ అనలేకపోతున్నారు. వరంగల్, హైదరాబాద్ ప్రాంతాల్లో ప్రాంతీయ ఉప సంచాలకులు, ఉపాధి శిక్షణ అధికారులు ఉన్నప్పటికీ, వారు రెండు మూడేళ్లకు ఒకసారి కూడా ఆకస్మిక తనిఖీలు చేయడం లేదు.రాష్ట్ర స్థాయిలో తనిఖీ ఉపాధి శిక్షణ అధికారి ఉన్నప్పటికీ ఆయన కూడా మొక్కుబడిగా మాత్రమే పర్యవేక్షణ చేస్తున్నారు.

**5. నకలుతో ఉత్తీర్ణత - బయటకు వస్తే ఉపాధి శూన్యం:**
పరీక్షల్లో ఏదో విధంగా నకలు చేసి ఐటిఐ పత్రం పొందిన విద్యార్థులకు బయట మార్కెట్లోకి వచ్చాక ఉపాధి దొరకడం లేదు. కొన్ని ప్రభుత్వ ఐటిఐలలో అవసరానికి మించి బోధన సిబ్బంది ఉన్నారు. చాలా కళాశాలల్లో బోధన సిబ్బంది తాత్కాలిక బదిలీపై వరంగల్, హైదరాబాద్, రంగారెడ్డి వంటి ప్రాంతాలకు వెళ్లడం వల్ల మారుమూల ప్రభుత్వ ఐటిఐలలో బోధన కుంటుపడింది.

**6. ప్రభుత్వానికి తక్షణ విజ్ఞప్తి:**
కొత్త అధునాతన శిక్షణా కేంద్రాలను టాటా సంస్థతో కలిసి ఏర్పాటు చేయడం కాదు. ఉన్న 60కి పైగా ప్రభుత్వ ఐటిఐలలో బోధనను బతికించండి. ఉన్న సంస్థలను బలోపేతం చేసి, పర్యవేక్షణను కట్టుదిట్టం చేసి, పేద విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన ఉపాధి కల్పించండి.

# హన్మకొండలో ఐటీ టవర్స్



**హనుమకొండ:** ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పిం చడంతో పాటు మత్తుకు దూరంగా ఉండాలని పిలుపునిస్తూ హనుమకొండలో నిర్వహించిన మారథాన్‌లో ఓరుగల్లు ప్రజలు వేల సంఖ్యలో పాల్గొన్నారు. నాయిని విశాల్ ట్రస్ట్ చైర్మన్ మీూా నాయిని రాజేందర్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ఈ మారథాన్‌లో మంత్రి శ్రీధర్ బాబు, పలువురు మీూాలు, ముఖ్యనేతలు పా ల్గొన్నారు. యువతతో కలిసి రన్నింగ్‌లో పాల్గొ న్న మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు.. బాలస ముద్రంలో ఓ టీస్టాల్ వద్ద ఆగి సరదాగా గడిపారు. టీ తాగుతూ సెల్ఫీలు దిగి సంది చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ఓరుగల్లు ప్రజలకు శుభవార్త తెలిపారు. త్వరలో హనుమకొండలో ×ు టవర్స్ నిర్మిస్తామని ప్రకటించారు.హనుమకొండ హాఫ్ మారథాన్ రన్‌తో సందడిగా మారింది. హయగ్రీవచారి మైదానం నుండి 5 కి,మీ, 10 కి.మీ, 21 కి.మీ మారథాన్ రన్ నిర్వహించారు. వరంగల్ పశ్చిమ మీూా నాయిని రాజేందర్ రెడ్డి తన తనయుడు విశాల్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన నాయిని విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్య క్రమాన్ని నిర్వహించారు. మారథాన్ లో వేలాదిమంది యువత, విద్యావంతులు, ఉద్యోగులు, వైద్యులు, క్రీడాకారులు, విక లాంగులు కూడా పాల్గొన్నారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం



# వరంగల్ లో అంగన్వాడీ కేంద్రాల నిధుల లూటీ

- గుత్తేదారుడు కు పనులు లేకుండానే చెల్లింపులు, అధికారుల అండదండలు
- కాగితాల్లోనే అభివృద్ధి, జేబుల్లోకి నిధులు

(వరంగల్ జోర్దార్ ప్రతినిధి )

వరంగల్ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలో అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధి పేరుతో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. పిల్లల కోసం ప్రభుత్వం కేటాయించిన నిధులను లక్ష్యంగా చేసుకుని కాగితాలపైనే పనులు పూర్తయినట్లు చూపించి చెల్లింపులు తీసుకున్నారన్నది ప్రధాన ఫిర్యాదు.




**2. క్షేత్రంలో పని శూన్యం, కాగితాల్లో పూర్తి:**
అంగన్వాడీ కేంద్రాలలో మరుగుదొడ్ల నిర్మాణం, గోడలకు రంగులు వేయడం, నేల తీర్చిదిద్దడం వంటి అభివృద్ధి పనులు చేసినట్లు చూపారు. కానీ క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే పనులు కనిపించడం లేదు. పని చేయలేదు కానీ చెల్లింపు పత్రం వచ్చింది, అభివృద్ధి జరగలేదు కానీ దస్త్రాల్లో మాత్రం పూర్తయినట్లు చూపించారు.

**3. రెండు భారీ చెల్లింపు పత్రాల చుట్టూ అనుమానాలు:**
ఈ అక్రమంలో రెండు చెల్లింపు పత్రాలు ప్రధానంగా తెరపైకి వచ్చాయి. ఒకటి పధ్నాలుగు లక్షల రూపాయలది, మరొకటి మూడున్నర లక్షల రూపాయలది. ఈ రెండు మొత్తాలను తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ పనులు చేసిన గుత్తేదారుడు నిరంజన్ అనే వ్యక్తిగా చెబుతున్నారు. అసలు పనులు ఎక్కడ జరిగాయి, ఎవరు పరిశీలించారు, ఎవరు ధృవీకరించారు, ఎవరి ఆధారంగా చెల్లింపులు చేశారు అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది.

**4. చెల్లింపు పత్రాల వెనుక అసలు లెక్క ఎవరిది:**
అభివృద్ధి పనులకు సంబంధించిన అంచనాలు, పాలనా అనుమతులు, పని ఆదేశాలు, కొలతల పుస్తకాలు, చెల్లింపు పత్రాలు, రశీదులు, పూర్తి ధృవీకరణ పత్రాలు, చెల్లింపుల వివరాలు, పనుల ఛాయాచిత్రాలు అన్నింటినీ బయటకు తీసి ఒకే చోట సరిపోల్చాలని డిమాండ్ వస్తోంది. దస్త్రాల్లో ఉన్న పనిని, క్షేత్రంలో ఉన్న పనిని కొలిచి తులనం చేస్తేనే అసలు నిజం బయటపడుతుంది.

**5. ఇది చిన్న తప్పు కాదు, ప్రజాధనం దోపిడీ:**
విచారణలో పనులు చేయకుండానే చేసినట్లు చూపించి ప్రభుత్వ నిధులు తీసుకున్నట్లు తేలితే, దానిని సాధారణ పాలనా తప్పిదంగా వదిలేయకూడదు. ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించిన వ్యవహారంగా పరిగణించి బాధ్యులైన అధికారులు, సిబ్బంది, సంబంధిత గుత్తేదారుడు ఎవరైనా సరే పాత్రను పూర్తిగా తేల్చి, నిధులను తిరిగి రాబట్టడంతో పాటు శాఖాపరమైన, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలి.

**6. మా డిమాండ్లు ఏమిటి:**
అ) ఈ వ్యవహారంపై సాధారణ తనిఖీతో సరిపెట్టకుండా స్వతంత్ర ఉన్నత స్థాయి అధికారులతో ప్రత్యేక విచారణ చేపట్టాలి.
ఆ) గతంలో జరిగిన అన్ని అభివృద్ధి పనుల వివరాలను పరిశీలించి, ఎంత నిధులు మంజూరయ్యాయి, ఎంత ఖర్చు చూపించారు, వాస్తవంగా ఎంత పని జరిగింది, ఎంత మొత్తానికి చెల్లింపు పత్రాలు చెల్లించారు, ఎవరు ధృవీకరించారు, ఎవరు చెల్లించారు అనే అంశాలను పూర్తిగా బయటపెట్టాలి.
ఇ) అంగన్వాడీ పిల్లల అభివృద్ధి కోసం వచ్చిన నిధులు నిజంగానే పిల్లల కోసం ఖర్చయ్యాయా, లేక కాగితాలపైనే అభివృద్ధి చేసి నిధులు మింగేశారా అన్న ప్రశ్నకు సమాధానం రావాలి, ప్రభుత్వానికి నష్టం కలిగిన ప్రతి రూపాయిని తిరిగి రాబట్టాలి.

# పదో తరగతి కూడా లేకుండా ప్రభుత్వ గెజిటెడ్ అధికారి హోదా

- ఉన్నత విద్య శాఖ లో నకిలీ ధ్రువపత్రాల మహా కుంభకోణం
- 2023 ఎన్నికల లబ్ధి కోసం తెచ్చిన ఒక ఉత్తర్వు, తెలంగాణ ఉన్నత విద్యకు ఉరితాడుగా మారింది
- వేయి మందికి పైగా అనర్హులకు శాశ్వత ఉద్యోగాలు

హైదరాబాద్ జోర్దార్ ప్రతినిధి

**1. బయటపడుతున్న దిగ్భ్రాంతికర నిజాలు:**
కళాశాలల్లో చదువు రాని, చదువు లేని అధ్యాపకులు ఎందరో ఉన్నారు. కనీసం పదో తరగతి కూడా పూర్తి చేయకుండానే పెద్ద హోదాలో నకిలీలు చలామణి అవుతున్నారు. తాత్కాలిక అధ్యాపకుల క్రమబద్ధీకరణలో జరిగిన అక్రమాలపై ఒక ప్రముఖ వార్తా సంస్థ చేస్తున్న సాహసోపేత కథనాలతో ఉన్నత విద్యాశాఖలో ప్రకంపనలు మొదలయ్యాయి.

**2. ఒక ఉత్తర్వుతో మొదలైన అన్యాయం:**
2023 ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు అప్పటి అధికార పక్షం తెచ్చిన ఒక ప్రభుత్వ ఉత్తర్వు, తెలంగాణలో ఉన్నత విద్యకు మరణ శాసనంగా మారింది. ఈ ఉత్తర్వు అడ్డం పెట్టుకుని అర్హత లేని విశ్వవిద్యాలయాల నుండి తెచ్చిన చెల్లని ధ్రువపత్రాలతో వెయ్యి మందికి పైగా అక్రమార్కులు చిన్న కళాశాలల్లో శాశ్వత ఉద్యోగులుగా చదువులు చెబుతున్నారు.




**3. నమ్మలేని మోసాలు - విశ్వవిద్యాలయం పుట్టకముందే చదువా?:**
కొందరు కనీసం పదో తరగతి కూడా లేకుండా ప్రభుత్వ అధికారి హోదాను అనుభవిస్తున్నారు. ఇంకొందరు విశ్వవిద్యాలయం పుట్టకముందే అక్కడ చదివినట్లు ధ్రువపత్రాలు తెచ్చుకున్నారు. ఇలాంటి నకిలీ ధ్రువపత్రాలపై 2023లోనే అనుమానాలు వచ్చినా, ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోలేదు.

**4. ఉన్నతాధికారుల పాత్ర అత్యంత అనుమానాస్పదం:**
ఈ మొత్తం కుంభకోణంలో అప్పటి ప్రాంతీయ ఉప సంచాలకుల పాత్ర అత్యంత వివాదాస్పదంగా ఉన్నది. చాలా కేసుల్లో జయప్రదాబాయి అనే అధికారి చక్రం తిప్పినట్లు కనిపిస్తున్నది. కొందరిని నకిలీలుగా గుర్తించి వారి జీతాలు ఆపినా, జయప్రదాబాయి ఆదేశాలతో జీతాలు యథావిధిగా కొనసాగించారు. అంటే చాలా కేసుల్లో నకిలీ అని తెలిసి కూడా సిగ్గు లేకుండా ఈ అధ్యాపకులను కొనసాగిస్తున్నారు.

**5. ఎవరికి నష్టం?:**
ఈ చదువు రాని, పనికిరాని అధ్యాపకులు చెప్పే పాఠాలతో ఎంత మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందో ఆలోచించాలి. ఇది కష్టపడి చదివి, అన్ని అర్హతలు ఉన్న నిరుద్యోగుల కడుపు కొట్టడం కాదా? ప్రభుత్వ అధికారి హోదా ఉన్న ఉద్యోగాల్లోకి కనీసం పరీక్ష కూడా లేకుండా వీళ్లందరినీ ఎలా తీసుకున్నారు?ఈ ప్రశ్నలకు ఇప్పటికైనా సమాధానాలు వస్తాయో లేదో వేచి చూడాలి. అనర్హులను వెంటనే తొలగించి, అర్హులైన నిరుద్యోగులకు న్యాయం చేయాలని విద్యార్థి, నిరుద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# ఆర్థోపెడిక్ ట్రామాలో సరికొత్త పరిణామాలు - కిమ్స్ నిపుణులతో ఓటీఎస్ 2026 సదస్సు



**హైదరాబాద్, అక్టోబర్ 17::** రోడ్డు ప్రమాదాలు, ఎత్తు నుంచి పడిపోవడం వంటి ఘటనల్లో సంభవించే ఎముకల విరుగుళ్లు, సంక్లిష్ట కీళ్ల గాయాలకు మెరుగైన చికిత్స అందించడంలో ఆధునిక సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోంది. ఈ నేపథ్యంలో ఆర్థోపెడిక్ ట్రామా వైద్యరంగంలో వస్తున్న నూతన పరిణామాలు, అధునాతన శస్త్రచికిత్స పద్ధతులు, రోబోటిక్ సాంకేతికతపై చర్చించేందుకు హైదరాబాద్ వేదికగా కిమ్స్ ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్ ట్రామా సమ్మిట్ 2026 అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సదస్సులో 1,000 మందికి పైగా ప్రతినిధులు, 120 మంది వైద్య నిపుణులు పాల్గొన్నారు.పలు ఎముకలు విరగడం వైద్యులకు సవాలురోడ్డు ప్రవదాలు, ఇతర తీవ్ర గాయాల కారణంగా ఎముకలు విరగడం, కీళ్లకు నష్టం కలగడం, కటిభాగంలోని ఎముకలకు గాయాలు కావడం, ఒకేసారి పలు ఎముకలు విరగడం వంటి సమస్యలకు చికిత్స అందించడం వైద్యులకు సవాలుగా మారుతోందని నిర్వహణ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్ కాశా పేర్కొన్నారు. ఇలాంటి సందర్భాల్లో సరైన వైద్య నిర్ణయాలు తీసుకోవడంతో పాటు అధునాతన శస్త్రచికిత్స నైపుణ్యాలు, ఆధునిక ఇమేజింగ్ సాంకేతికత, నావిగేషన్ వ్యవస్థలు, రోబోటిక్ పరిజ్ఞానం అవసరమవుతాయని చెప్పారు. తాజా వైద్య విధానాలపై నిరంతర శిక్షణ పొందడం ద్వారా చికిత్సా ప్రమాణాలను మెరుగుపరచవచ్చనే లక్ష్యంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నామని తెలిపారు.సాంప్రదాయ ఆర్థోపెడిక్ ట్రామా చికిత్సా విధానాలకు, ఆధునిక సాంకేతికతతో అభివృద్ధి చెందుతున్న చికిత్సా పద్ధతులకు మధ్య సమన్వయం పెంపొందించడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశమన్నారు. వైద్యులు తమ అనుభవాలను పంచుకోవడం, సంక్లిష్ట కేసులపై చర్చించడం, కొత్త చికిత్సా విధానాలను నేర్చుకోవడం ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా ప్రోత్సహించనున్నారని అన్నారు.ఆర్థోపెడిక్ సదస్సులో యంగ్?, ప్రాక్టీసింగ్ సర్జన్స్? ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. దేశవ్యాప్తంగా 120 మంది, నలుగురు అంతర్జాతీయ వైద్య నిపుణులు ఆర్థోపెడిక్ ట్రామాలో అత్యాధునిక శస్త్ర చికిత్స విధానాలు, ఎముకల విరుగుళ్లపై నూతన విధానాలు వివరించడం జరిగింది. క్లిష్టమైన పరిస్థితుల్లో రోబోటిక్ సాంకేతికతతో శస్త్ర చికిత్సలు ఎలా చేయవచ్చో వివరించడం జరిగింది - డాక్టర్ శ్రీనివాస్ కాశా, అధ్యక్షులనాలుగు దేశాల నుంచి నిపుణులుఈ సదస్సులో బ్రిటన్, ఇజ్రాయెల్, థాయ్‌లాండ్, దక్షిణ కొరియా దేశాలకు చెందిన నలుగురు అంతర్జాతీయ వైద్య నిపుణులతో పాటు దేశంలోని 75 మందికి పైగా ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు పాల్గొన్నారు. ప్రీ-కాన్ఫరెన్స్ డ్రై ల్యాబ్‌లు, నిపుణుల చర్చలు, బ్రేక్‌ఫాస్ట్ సెషన్లు, చర్చా కార్యక్రమాలు, కేసుల ఆధారంగా వైద్య విశ్లేషణలు, సంక్లిష్ట ఎముకల విరుగుళ్ల చికిత్సకు సంబంధించిన ప్రదర్శనలు నిర్వహించారు.ఓటీఎస్-2026లో భాగంగా ట్రామా రోబోటిక్ వ్యవస్థల పనితీరును ప్రత్యక్షంగా ప్రదర్శించారు. ఆర్థోపెడిక్ ట్రామా శస్త్రచికిత్సల్లో ఈ సాంకేతికతను ఎలా వినియోగించవచ్చు? దాని వల్ల కలిగే ప్రయోజనాలు, పరిమితులు ఏమిటి? వంటి అంశాలపై వైద్యులకు అవగాహన కల్పించారు. కొత్త సాంకేతికతలను వైద్య విధానాల్లోకి తీసుకురావడంతో పాటు వాటిని శాస్త్రీయంగా విశ్లేషించి, రోగుల అవసరాలకు అనుగుణంగా వినియోగించడంపై దృష్టి సారించారు.భారత ర్థోపెడిక్ వైద్యరంగంలో విశేష సేవలందించిన ముంబయికి చెందిన సీనియర్ వైద్యుడు డాక్టర్ డి.డి. తన్నాను ఈ సదస్సులో గౌరవించారు. ముఖ్యంగా ఆర్థోపెడిక్ ట్రామా విభాగంలో ఆయన అందించిన సేవలు, వైద్యులకు చేసిన మార్గదర్శనం, తదుపరి తరాల వైద్యుల అభివృద్ధికి చేసిన కృషిని గుర్తిస్తూ ఈ గౌరవం అందించారు. సదస్సులో భాగంగా ఏఓ ట్రామా ఆసియా పసిఫిక్ ఛైర్ డాక్టర్ మందీప్ ధిల్లాన్ ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు.
మెరుగైన చికిత్సే లక్ష్యంమూడు రోజులు 'ఆర్థోపెడిక్ ట్రామా' అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్న ఈ సదస్సు ద్వారా వైద్య నిపుణులు, శస్త్రచికిత్స వైద్యులు, విద్యావేత్తలు, యువ వైద్యుల మధ్య విజ్ఞాన మార్పిడి, అంతర్జాతీయ సహకారం పెంపొందించాలని నిర్వాహకులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆధారాలతో కూడిన వైద్య విధానాలను ప్రోత్సహించడం, శస్త్రచికిత్స నైపుణ్యాలను మెరుగుపరచడం, సంక్లిష్ట కండరాలు ఎముకల గాయాలకు గురైన రోగులకు మెరుగైన చికిత్స అందించే దిశగా ఈ సదస్సు ఉపయోగపడనుంది. ఈ సదస్సుకు నిర్వహణ అధ్యక్షులుగా డాక్టర్ శ్రీనివాస్ కాశా, డాక్టర్ అశోక్ గవాస్కర్, డాక్టర్ ప్రణవ్ షా, డాక్టర్ అతుల్ పాటిల్, డాక్టర్ ప్రదీప్ నేమాడే, డాక్టర్ అభయ్ ఎల్వెన్స్, డాక్టర్ అశోక్ రాజు జి. వ్యవహరించారు.

# జాతీయ రహదారులపై దసరా ట్రాఫిక్ - చౌటుప్పల్ దాటేందుకు 45 నిమిషాల టైం

**హైదరాబాద్, అక్టోబర్ 17::**



దసరా పండగను సొంతూళ్లలో జరుపుకునేందుకు నగరం పల్లెబాట పట్టారు. దీంతో జాతీయ రహదారులపై రద్దీ భారీగా పెరిగిపోయింది. చాలామంది కుటుంబంతో సహా సొంత వాహనాల్లో బయలుదేరారు. హైదరాబాద్-విజయవాడ హైవేతో పాటు హైదరాబాద్-ముంబై, చెన్నై వైపు వెళ్లే రహదారులపై వెహికల్స్ నెమ్మదిగా సాగుతున్నాయి. రేపు ఆదివారం సద్దుల బతుకమ్మ, సోమవారం మహన్నవమి, మంగళవారం విజయ దశమి.. పండుగ సెలవులు కావడంతో అంతా ఊళ్లకు బయలుదేరారు.చౌటుప్పల్ దాటడం పెద్ద గండమేరహదారి విస్తరణ పనులు, ఫ్లై ఓవర్ పనులు సాగుతున్న హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై ట్రాఫిక్ భారీగా పెరిగింది. యాదాద్రి జిల్లా చౌటుప్పల్ వద్ద వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. చౌటుప్పల్‌లో ఫ్లై ఓవర్ల నిర్మాణం వల్ల వాహనాల వేగం తగ్గించాల్సి వస్తోంది. రద్దీ పెరిగిపోయి 3 కిలోమీటర్ల నుంచి వాహనాలు ఆగిపోయాయి. చౌటుప్పల్ పట్టణాన్ని దాటేందుకు 45 నిమిషాలకు పైగా సమయం పడుతోంది. అర్ధరాత్రికి ఈ సమయం మరింత పెరిగే అవకాశం ఉంది.చిట్యాల వద్ద అదే పరిస్థితిచౌటుప్పల్ దాటినా చిట్యాల వద్ద అదే సమస్య. ఇక్కడ నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ పనుల వద్ద సాధారణంగానే ట్రాఫిక్ నెమ్మదిగా సాగుతుంది. ఇప్పుడు పండుగ సీజన్ కావడంతో రద్దీ నాలుగింతలు పెరిగింది. ఇక్కడ కూడా సుమారు గంట నుంచి ట్రాఫిక్?లో ఆగిపోయిన వాహనదారులు విజయవాడ హైవేపై పడిగాపులు కాస్తున్నారు. పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ పెరగడంతో 24 టోల్ బూత్‌లలో 16 విజయవాడ వైపు తెరిచి ఉంచారు.ట్రాఫిక్ పోలీసులపై వాహనదారులు సీరియస్‌రంగారెడ్డి, నల్గొండ, యాదాద్రి పోలీసులు ట్రాఫిక్ వేగంగా సాగేందుకు చేపట్టిన చర్యలతో పెద్దగా ఫలితం కనిపించడం లేదు. పోలీసులు సరైన చర్యలు తీసుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. అటు హైదరాబాద్-వరంగల్, హైదరాబాద్-కరీంనగర్ రహదారులపైనా ఇదే పరిస్థితి. యాదాద్రి టోల్‌ప్లాజా వద్ద వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి.బస్సులు సరిపోక ప్రైవేటు వైపు మొగ్గుమరోవైపు ఇళ్లకు వెళ్లేవారితే హైదరాబాద్‌లోని ప్రధాన బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. ఎంజీబీఎస్, జేబీఎస్, దిల్‌సుఖ్‌నగర్?తో పాటు ఎల్బీనగర్, ఉప్పల్, ఆరాంఘర్ వద్ద రద్దీ నెలకొంది. రద్దీకి అనుగుణంగా బస్సులు నడుపుతున్నామని ఆర్టీసీ చెబుతున్నా సరిపోవడం లేదు. బస్సులన్నీ కిక్కిరిసి నడుస్తున్నాయి. దీనికి తోడు స్పెషల్ బస్సుల పేరుతో 50శాతం అదనంగా తీసుకుంటున్నారని ప్రయాణికులు మండిపడుతున్నారు. దీంతో ప్రైవేటు వాహనాలకు డిమాండ్ పెరిగింది. డబ్బులు పోయినా ఫర్వాలేదు కానీ వేగంగా ఇంటికి చేరాలని కొందరు భావిస్తున్నా జాతీయ రహదారులపై ట్రాఫిక్ జామ్?లు వారి పండగ ఉత్సాహాన్ని నీరుగారుస్తున్నాయి.

# తండ్రి సేవా సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న కుమారులు



■ శానిటేషన్ సిబ్బందికి దుస్తుల పంపిణీ

**వరంగల్,జోర్దార్ ప్రతినిధి:**వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 23వ డివిజన్ కొత్తవాడలో కీర్తి శేషులు,మాజీ కార్పొరేటర్,కుడా డైరెక్టర్ వెలుగం శ్రీనివాస్ జ్ఞాపకార్థం ఆయన కుమారులు వెలుగం రాకేష్,రాజేష్ మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వెలుగం రాకేష్ మాట్లాడుతూ..గత 22 సంవత్సరాలుగా తమ తండ్రి సంప్రదాయాన్ని కొనసాగిస్తూ శానిటేషన్ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.తమ తండ్రి ఆచరించిన ప్రతి సంప్రదాయాన్ని తాము తూచా తప్పకుండా పాటిస్తామని,ఆయన ప్రజలకు చేసిన సేవలను కొనసాగిస్తూ ఆయన అడుగుజాడల్లో నడుస్తామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వెలుగం రాజేష్, శ్రీకాంత్, శ్రీనాథ్, వలస వేణు,కిరణ్,22వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బస్వరాజు కుమార్ స్వామి, 23వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి చిప్ప వెంకటేశ్వర్లు, మాజీ కార్పొరేటర్ దామెర సర్వేశ్,ఎస్సీ సెల్ మాజీ సిటీ కన్వీనర్ జన్ను ప్రమోద్ కుమార్, దువ్వాళ రాజేందర్, కటకం విజయ్ కుమార్, అడిగొప్పుల సంపత్, హుస్సేన్, మండల శంకర్ తో పాటు మున్సిపల్ సిబ్బంది, జవాన్లు కుమార్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# రామగిరి మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

■ మహిళలు, చిన్నారుల సందడితో వెల్లివిరిసిన పండుగ శోభ






**రామగిరి, జోర్దార్ ప్రతినిధి:**రామగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకల్లో మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకమ్మ పాటలు, పండుగ సందడితో కార్యాలయ ప్రాంగణం కళకళలాడింది.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సామూహికంగా నిర్వహించడం ద్వారా సంప్రదాయాల ప్రాధాన్యాన్ని చాటిచెప్పారు. పండుగ వేడుకలు పాల్గొన్న వారిలో ఆనందోత్సాహాలను నింపాయి.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శైలజ రాణి, మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, నవాబుపేట సర్పంచ్ రొడ్డ మౌనిక, నాగేపల్లి సర్పంచ్ కొండవేనా దివ్య, పంచాయతీ కార్యదర్శులు, వకీలు పల్లె కాలనీ మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గుండారం రిజర్వాయర్‌లోకి సాగునీరు విడుదల



■ మంత్రి శ్రీధర్‌బాబు చొరవతో రైతులకు ఊరట
■ బీఆర్ఎస్ దుష్ప్రచారానికి ఇదే సమాధానం: తొట్ల తిరుపతి యాదవ్

**కమాన్‌పూర్, జోర్దార్ ప్రతినిధి:**మంథని నియోజకవర్గ రైతులకు సాగునీరు అందించేందుకు శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఎస్సారెస్పీ డీ-83 కాలువ ద్వారా గుండారం రిజర్వాయర్‌లోకి సాగునీటిని విడుదల చేశారు. మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ శనివారం కమాన్‌పూర్, రామగిరి, పెద్దపల్లి మండలాల కాంగ్రెస్ నాయకులు, ఎస్సారెస్పీ అధికారులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రిజర్వాయర్‌లోకి నీరు చేరుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవతోనే సాగునీటి విడుదల సాధ్యమైందని తొట్ల తిరుపతి యాదవ్ తెలిపారు. రైతుల పంటలు ఎండిపోకుండా, వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రితో శ్రీధర్‌బాబు మాట్లాడి నీటి విడుదలకు కృషి చేశారని పేర్కొన్నారు. రైతుల పక్షాన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే విద్యుత్తు, సాగునీరు అందవంటూ బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారానికి గుండారం రిజర్వాయర్‌లోకి సాగునీటి విడుదలే సమాధానమని తిరుపతి యాదవ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, మంత్రి శ్రీధర్‌బాబు రైతుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కమాన్‌పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.ఎస్. అన్వర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు, రామగిరి మండల మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్, కండె పోషం, కమాన్‌పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, గుండారం సర్పంచ్ జంగిలి పోశాలు, నాగేపల్లి మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య, పిడుగు శంకర్, బర్ల శ్రీకాంత్, గొల్లపల్లి రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

# నిలువునా రాలిపోతున్న ఆకాశపు అందము...

■ మన పాలపిట్టకి ఏమైంది?
■ ప్రజలారాలి ..ప్రజాస్వామ్యవాదులారా..!
■ ప్రకృతి ప్రేమికులారా..!
■ మన అస్తిత్వానికి ప్రతీక అయిన 'పాలపిట్ట'ను కాపాడుకుందాం!
■ రసాయన విషంపై యుద్ధం ప్రకటిద్దాం.. సేంద్రియ వ్యవసాయంతోనే మన రాష్ట్ర పక్షికి ప్రాణభిక్ష !

ఒక సమాజపు ప్రగతి, ప్రజాస్వామ్య స్ఫూర్తి కేవలం మనుషుల హక్కుల పరిరక్షణలోనే కాదు, ఆ సమాజంలోని పర్యావరణాన్ని, మూగజీవులను కాపాడుకోవడంలోనే దాగి ఉంది. దసరా పండుగ నాడు మనమంతా పరమ పవిత్రంగా భావించి దర్శించుకునే నీలిరంగు రెక్కల దేవత, మన తెలంగాణ రాష్ట్ర పక్షి 'పాలపిట్ట'నేడు అంతరించిపోయే అంచున నిలబడి ఆక్రందిస్తోంది. పొలాల గట్లపై 'కిలకిలా' రావాలు పలికిన ఈ రైతు నేస్తం.. మనం చల్లుతున్న రసాయన ఎరువుల విషపు కాటుకు నిలువునా రాలిపోతోంది. ఈ మాతృభూమిని, ప్రకృతిని ప్రేమించే ప్రతి ఒక్క పౌరుడు, ప్రజాస్వామ్యవాది, పచ్చదనాన్ని కాంక్షించే ప్రతి ప్రకృతి ప్రేమికుడు ఈ ఘోరంపై ఆలోచించాల్సిన అత్యవసర సమయం ఆసన్నమైంది.

**నాటి సహజమైన దసరా వైభవం.. నేటి బోనుల బందీ విషాదం !**

గతంలో దసరా పండుగ వచ్చిందంటే పల్లెల్లో ఒక ప్రత్యేకమైన కోలాహలం కనిపించేది. నాటి సహజమైన దసరా రోజుల్లో, సాయంత్రం ఊరంతా కలిసి జమ్మి పూజకు వెళ్లేటప్పుడు, ఊరి పొలిమేరల్లోనో లేదా పొలాల గట్లపై ఉన్న మోదుగ, తాడి చెట్లపైనో పాలపిట్టలు స్వేచ్ఛగా వాలి సజీవంగా కనిపించేవి. ఆకాశంలో నీలి రంగు రెక్కలు విప్పుకుని సప్తవర్ణాల కాంతులతో ఎగురుతున్న పాలపిట్టను చూడటమే ఒక పండుగలా ఉండేది. ఆ సుందర దృశ్యాన్ని కళ్లారా చూసి, దండం పెట్టుకుని, ఒకరికొకరు జమ్మి ఆకులు ఇచ్చుకుని పండుగ శుభాకాంక్షలు చెప్పుకునేవారు. ప్రకృతితో ముడిపడిన ఆనాటి భక్తి ఎంతో నిష్కల్మషమైనది. కానీ నేటి దసరా పూర్తిగా మారిపోయింది. పర్యావరణం కలుషితమై నేడు దసరా నాడు పొలాల్లో వెతికినా ఒక్క పాలపిట్ట కూడా ఆకాశంలో కనిపించడం లేదు. స్వేచ్ఛగా ఎగరాల్సిన పక్షిని నేడు బోనుల్లో బంధించి, డబ్బుల కోసం బజార్లలో ప్రదర్శిస్తున్నారు. భక్తి చాటున జరుగుతున్న ఈ స్వార్థ వ్యాపారం వల్ల పండుగ నాటి పవిత్రత పోయి మూగజీవుల ఆక్రందన మిగులుతోంది. నాటి ప్రకృతి దర్శనం కాస్తా.. నేటి బోనుల బందీగా మారిపోయింది..

**ప్రకృతి ఇచ్చిన అపురూప వర ప్రసాదం.. ఆకాశ రంగు పాలపిట్ట విశిష్టత !**

పాలపిట్ట అంటే కేవలం ఒక పక్షి కాదు; అది ప్రకృతి మనకు ప్రసాదించిన సహజ సిద్ధమైన రక్షకుడు మరియు అపురూపమైన జీవవైవిధ్య సంపద. దీని తల, వెనుక భాగం ఆకుపచ్చ తిరిగిన నీలం రంగులో, గొంతు ముదురు గోధుమ రంగులో ఉండి, ఎగిరేటప్పుడు రెక్కలపై ముదురు నీలం, లేత నీలం రంగుల చారలు కాంతివంతంగా మెరుస్తాయి. ఈ అద్భుతమైన రంగుల కలయిక వల్లే దీనిని ఆకాశ రంగు పక్షి అని పిలుస్తారు. రైతుకు పాలపిట్టను మించిన మిత్రుడు లేడు. పంటలను నమిలిపారేసే హానికరమైన మిడతలు, ఎలుకలు, పురుగులు, గొంగళి పురుగులు మరియు విషపూరిత కీటకాలను ఏరిపారేసే 'సహజ సైనికుడు' ఇది. పొలాల్లో పాలపిట్టలు ఉంటే వేల రూపాయల పురుగుల మందుల ఖర్చు తప్పుతుంది. పర్యావరణాన్ని కాపాడుతూ, విషం లేని పంటను మనకు అందించడంలో పాలపిట్ట పాత్ర వెలకట్టలేనిది.

**పొలాల్లో విషపు గుళికలు: మనమే మన చేతులతో చంపుకుంటున్నామా ?**

గత కొన్నేళ్లలోనే దేశవ్యాప్తంగా పాలపిట్టల జనాభా 30% నుండి 35% పైగా పడిపోయింది. దీనికి అతిపెద్ద, భయంకరమైన కారణం---మన పొలాల్లో వాడుతున్న రసాయన ఎరువులు, విచక్షణారహిత పురుగుల మందులు. అధిక దిగుబడి కోసం అడ్డూఅదుపూ లేకుండా రసాయన క్రిమిసంహారకాలు చల్లుతూ అన్నం పెట్టే భూమిని మనమే విషం చేస్తున్నాం. ఆ రసాయనాలు తిని చనిపోతున్న కీటకాలను, పురుగులను మన పాలపిట్టలు ఆహారంగా తీసుకుంటున్నాయి. ఆ విషపూరితమైన కీటకాలను తినడం వల్ల రసాయనాలు పాలపిట్టల శరీరంలోకి చేరి, వాటి కాలేయం, ఊపిరితిత్తులు పాడైపోయి, నోటి నుంచి రక్తం కక్కుకుంటూ విలవిలలాడి చనిపోతున్నాయి. మనం కొట్టే రసాయనాలు పంటల మీద ఉన్న పురుగులనే కాదు, మనల్ని నమ్ముకున్న పక్షుల ప్రాణాలను కూడా నిలువునా తీసేస్తున్నాయి.

**ఆలోచించండి రైతుబాంధవులారా! సేంద్రియ ఎరువుల వైపే మన అడుగులు పడాలి !**

మనం వాడుతున్న రసాయన ఎరువుల వల్ల భూమి నిస్సారమైపోవడమే కాకుండా, మనకు మేలు చేసే మిత్ర పురుగులు, పక్షులు అంతరించిపోతున్నాయి. ఇదొక హెచ్చరిక! మనం మారకపోతే ప్రకృతి మనల్ని క్షమించదు. ఇకనైనా మనం కళ్లు తెరవాలి. రసాయనాల వాడకాన్ని పూర్తిగా తగ్గించి, పశువుల పేడ, వానపాముల ఎరువు, వేప పిండి, జీవామృతం వంటి సేంద్రియ ఎరువుల వైపు మళ్లాలి. సేంద్రియ వ్యవసాయం వల్ల భూమి తల్లి ఆరోగ్యం బాగుపడుతుంది, పంటలకు సహజమైన రోగనిరోధక శక్తి వస్తుంది. అన్నిటికంటే ముఖ్యంగా, మన పొలాల గట్లపై మళ్లీ పాలపిట్టలు స్వేచ్ఛగా తిరుగుతూ, ఎలాంటి రసాయనాల ఖర్చు లేకుండా పంటకు పట్టే పురుగులను ఏరివేస్తాయి. పక్షులు బతికితేనే పర్యావరణం బతుకుతుంది.. పర్యావరణం బాగుంటేనే మానవజాతి మనుగడ సాధ్యమవుతుంది.

**పండుగ సంబరాల్లో బందీ అవుతున్న స్వేచ్ఛ.. దసరా వేళ మూగజీవుల ఆక్రందన!**

మరోవైపు దసరా రోజున పాలపిట్టను చూడాలనే సాంప్రదాయాన్ని కొందరు స్వార్థపరులు వ్యాపారంగా మార్చేసి ఆ పక్షి స్వేచ్ఛను హరిస్తున్నారు. పండుగకు కొన్ని రోజుల ముందే వేటగాళ్లు ఈ పక్షులను అక్రమంగా బంధిస్తున్నారు. ఎగిరిపోకుండా ఉండటానికి ఆ పక్షి రెక్కలను కత్తిరిస్తారు. కదలకుండా ఉండటానికి కాళ్లకు దారాలు కట్టి, రెక్కలకు ప్రత్యేకమైన జిగురు పూస్తారు. చిన్న బోనుల్లో పెట్టి, ఆకలితో అలమటించేలా చేసి ప్రదర్శనకు ఉంచుతారు. పండుగ ముగిసేసరికి తీవ్రమైన గాయాలతో, ఆహారం లేక వందలాది పాలపిట్టలు నరకయాతన అనుభవిస్తూ చనిపోతున్నాయి. సంబరాల పేరుతో ఒక జీవి ప్రాణాన్ని బలితీసుకోవడం మన సంస్కృతి కాదు.

**వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972: పక్షులను హింసిస్తే జైలు శిక్ష తప్పదు!**

పాలపిట్టను తాకడం కూడా చట్టప్రకారం నేరమనే సంగతి చాలామందికి తెలియదు. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం పాలపిట్టను వేటాడటం, పట్టుకోవడం, బోనులో బంధించడం లేదా అమ్మడం పూర్తిగా నిషేధం. ఈ చట్టాన్ని ఉల్లంఘిస్తే 3 సంవత్సరాల కఠిన జైలు శిక్ష లేదా రూ. 1,00,000 (లక్ష రూపాయల) జరిమానా లేదా ఈ రెండూ కలిపి విధిస్తారు , పక్షులను హింసిస్తే జైలు గోడల మధ్య ఊచలు లెక్కపెట్టాల్సిందే.

**రేపటి తరం కోసం మన అస్తిత్వాన్ని కాపాడుకుందాం!**

రేపటి తరం పిల్లలకు పాలపిట్టను కేవలం పుస్తకాల్లోని బొమ్మల్లోనో, అంతర్జాల చిత్రాల్లోనో చూపించాలా? లేక నిజంగా ఆకాశంలో ఎగురుతున్న నీలి రంగు అందాన్ని చూపించాలా? అనేది మన చేతుల్లోనే ఉంది. రసాయన ఎరువుల మహమ్మారిని తరిమికొట్టి, సేంద్రియ వ్యవసాయాన్ని గుండెలకు హత్తుకుందాం. మన స్వార్థాన్ని వీడి, చట్టాన్ని గౌరవించి, ప్రకృతిని ప్రేమిద్దాం. మన రాష్ట్ర పక్షిని మన గుండెల్లో పెట్టి కాపాడుకుందాం!



రచయిత
గోవిందు నరేష్
సామాజిక విశ్లేషకులు

# దుర్గాదేవిని దర్శించుకున్న సింగరేణి అధికారులు



■ లద్నాపూర్‌లో ఘనంగా సత్కరించిన ఆలయ కమిటీ

**రామగిరి, జోర్దార్ ప్రతినిధి:**రామగిరి మండలం లద్నాపూర్ గ్రామంలోని శ్రీ గోదా రంగనాయక స్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కొలువుదీరిన దుర్గాదేవి అమ్మవారిని సింగరేణి ఆర్జీ-3 ప్రాజెక్టు అధికారి జంగేటి రాజశేఖర్, ఓసీపీ-2 మేనేజర్ భరత్ కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చైర్మన్ బర్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి కిషోర్ సింగరేణి అధికారులకు అమ్మవారి కంకణధారణ చేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాలొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వనం రామచంద్రరావు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, దుర్గామాత భక్తులు పాల్గొన్నారు.

# మహిళా నాయకత్వానికి జనసేన ప్రాధాన్యం



**ఏపీ స్టేట్ జోర్దార్ బ్యూరో, చింతూరు,:**దేవీపట్నం మండలంలో జనసేన పార్టీకి చెందిన వీర మహిళ పాండా వరలక్ష్మి జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజాసేవే లక్ష్యంగా, మండల అభివృద్ధికి తన వంతు కృషి చేయాలనే సంకల్పంతో ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు.

జనసేన పార్టీ అధినే త, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మహిళా సాధికారతకు, రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యానికి ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో పాండా వరలక్ష్మి నిర్ణయం ప్రాధాన్యం సంతరి ంచుకుంది. మహిళలు నాయకత్వ బాధ్యతలు చేపట్టి ప్రజలకు సేవ చేయాలనే జనసేన ఆశయా లకు అనుగుణంగా ఆమె ముందుకు సాగుతున్నారు.

దేవీపట్నం మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారం,
గ్రామాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండటమే తన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.

పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రజల విశ్వాసాన్ని పొందుతూ, ప్రజాసేవలో తనదైన ముద్ర వేయాలని పాండా వరలక్ష్మి ఆకాంక్షిస్తున్నారు.

# వంగపహాడ్ పీఏసీఎస్ చైర్మన్‌గా అనిల్ రెడ్డి



**హనుమకొండ,జోర్దార్ ప్రతినిధి:**గ్రేటర్ వరంగల్ 2వ డివిజన్ పరిధిలోని వంగపహాడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా అనిల్ రెడ్డి నియమితులైన సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును హనుమకొండలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు నూతన చైర్మన్ అనిల్ రెడ్డి, పీఏసీఎస్ కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ రైతుల సంక్షేమానికి, సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.అనంతరం కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును శాలువాలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

ఈ కార్యక్రమంలో 2వ డివిజన్ అధ్యక్షుడు పుట్ట తిరుపతి, ఉపాధ్యక్షుడు రవీందర్, మాజీ చైర్మన్ మెరుగు రాజేష్ గౌడ్, దోమ కుమార్, గ్రామశాఖ అధ్య క్షులు రాజు, పొన్నాల కిరణ్, పీఏసీఎస్ కమిటీ సభ్యులు గండు అశోక్, ఇంజపురి రాములు, కొండ రాజు, సముద్రాల సూర్యనారాయణ, కోరె సరో జన, మేరగుట్టి సూరయ్య, మెరుగు రాధిక, పొన్నాల రాధ, పోలాది రామ్ రెడ్డి, కన్నెబోయిన రాజు, బండి శంకరయ్య, రేమిడి సాంబ రెడ్డి, డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ప్రభుత్వ పథకాలు సకాలంలో అందేలా చూడాలి



**పెద్దేముల్ ,జోర్దార్ ప్రతినిధి:**పెద్దేముల్ మండల కేంద్రంలో రైతు సేవా సహకార సంఘం (ఎఫ్ఎస్సీఎస్) నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నూతన చైర్మన్ ఎల్లారెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌తో పాటు పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నూతనంగా బాధ్యతలు చేపట్టిన పాలకవర్గ సభ్యులు రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు రైతులకు సకాలంలో అందేలా కృషి చేయాలని కోరారు. అనంతరం నూతన చైర్మన్, వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

# పూల గోపురం వెనుక మాయమవుతున్న తెలంగాణ బతుకు కథ!

పల్లె ఆడబిడ్డల జీవనంతో ముడిపడిన బతుకమ్మకు పెరుగుతున్న వాణిజ్య రంగు.. ప్రకృతి, సంప్రదాయాల పరిరక్షణపై ప్రశ్నల

బతుకమ్మ అంటే కేవలం రంగురంగుల పూలను పేర్చి ఆడే పండుగ కాదు.. తెలంగాణ పల్లె జీవనంతో, మహిళల సామూహిక చైతన్యంతో, ప్రకృతితో ముడిపడిన ఒక సాంస్కృతిక ప్రతీక. తరతరాలుగా గ్రామీణ మహిళలు తమ జీవితంలోని సంతోషాలు, బాధలు, ఆశలు, ఆకాంక్షలను పాటలుగా మలుచుకుని బతుకమ్మ చుట్టూ తమ అనుబంధాన్ని చాటుకున్నారు. అయితే ఆధునిక కాలంలో ఈ పండుగ అసలు స్ఫూర్తి కంటే భారీ కార్యక్రమాలు, ప్రచార ఆర్భాటం, వాణిజ్య వేడుకలకు ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బతుకమ్మ చరిత్రకు సంబంధించి తెలంగాణలో అనేక జానపద కథనాలు, స్థానిక విశ్వాసాలు ఉన్నాయి. వాటిలో మహిళల జీవితం, ప్రకృతిపై ఆధారపడిన పల్లె సమాజం, కష్టకాలంలో బతుకు కోసం సాగిన పోరాటం వంటి అంశాలు కనిపిసాయి. అందుకే బతుకమ్మను కేవలం వినోద కార్యక్రమంగా కాకుండా తెలంగాణ ప్రజల జీవన సంస్కృతికి అద్దంగా చూడాల్సిన అవసరం ఉంది.

**పల్లె మహిళల నుంచి ప్రచార వేదికల వరకు..**

తంగేడు, గునుగు, బంతి వంటి స్థానిక పూలను సేకరించి బతుకమ్మను పేర్చే సంప్రదాయం గ్రామీణ మహిళల జీవితంతో విడదీయలేనిది. అడవులు, పొలాలు, గుట్టలు, చెరువుల చుట్టూ తిరిగి పూలను సేకరించి, వాటిని అందంగా పేర్చి, పాటలు పాడుతూ బతుకమ్మను జరుపుకోవడం పల్లె సంస్కృతిలో ఒక ప్రత్యేకమైన భాగం.

కానీ నేడు బతుకమ్మ వేడుకలు భారీ వేదికలు, ప్రచార కార్యక్రమాలు, కార్పొరేట్ కార్యక్రమాల రూపం దాల్చుతున్నాయి. పండుగకు ప్రాణమైన పల్లె మహిళల కంటే.. వేదికలపై కనిపించే ఆర్భాటానికే ఎక్కువ ప్రాధాన్యం దక్కుతోందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. పూలను ఏరే చేతులు కనిపించకుండా, పూల పండుగను ప్రదర్శించే వేదికలు మాత్రమే కనిపిస్తే.. బతుకమ్మ అసలు స్ఫూర్తి ఎక్కడ మిగులుతుందన్న ప్రశ్న తలెత్తుతోంది.

**గుట్టలు మాయమైతే పూలు ఎక్కడి నుంచి?**

బతుకమ్మను కాపాడాలంటే ముందుగా దాని వెనుక ఉన్న ప్రకృతిని కాపాడాల్సిన అవసరం ఉంది. తంగేడు వంటి పూలు పూసే గుట్టలు, కొండలు క్రమంగా తవ్వకాలకు గురవుతుండటం.. చెరువులు ఆక్రమణలకు గురవుతుండటం.. పచ్చదనం తగ్గిపోవడం ఆందోళన కలిగించే అంశాలుగా మారాయి.

ఒకవైపు ప్రకృతి వనరులను ధ్వంసం చేస్తూ మరోవైపు బతుకమ్మను ఘనంగా నిర్వహించడం ఎంతవరకు సమంజసం? గుట్టలు లేకపోతే పూలు ఎక్కడి నుంచి వస్తాయి? చెరువులు లేకపోతే నిమజ్జనం ఎక్కడ? ప్రకృతి మిగలకపోతే పూల పండుగకు అర్థం ఏమిటి? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**పండుగకు బదులు ఈవెంట్‌గా మారుతోందా?**

బతుకమ్మ పేరుతో నిర్వహించే కొన్ని కార్యక్రమాల్లో డీజేలు, మద్యం, అసభ్యకర నృత్యాలు చోటుచేసుకోవడంపై కూడా విమర్శలు ఉన్నాయి. పండుగను ఆనందంగా జరుపుకోవడం తప్పు కాదు. కానీ దాని సాంస్కృతిక నేపథ్యాన్ని పక్కన పెట్టి కేవలం వినోద కార్యక్రమంగా మార్చడం మాత్రం ఆందోళన కలిగించే పరిణామమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

బతుకమ్మ పాటలు, జానపద కళలు, మహిళల సామూహిక భాగస్వామ్యం, స్థానిక పూల ప్రాధాన్యత వంటి అంశాలను కొత్త తరానికి పరిచయం చేయాల్సిన బాధ్యత సమాజంపై ఉంది. లేదంటే భవిష్యత్ తరాలకు బతుకమ్మ అంటే భారీ సౌండ్ సిస్టమ్స్, వేదికలు, ప్రచార కార్యక్రమాలే గుర్తుండిపోయే పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంది.

**ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అంశాలివే..**

బతుకమ్మను కేవలం అధికారిక వేడుకగా కాకుండా తెలంగాణ సాంస్కృతిక వారసత్వంగా పరిరక్షించాలి. గ్రామీణ మహిళల భాగస్వామ్యాన్ని పెంచడంతో పాటు స్థానిక పూల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి. తంగేడు, గునుగు వంటి పూలు పెరిగే సహజ ప్రాంతాలను రక్షించాలి. చెరువులు, గుట్టలు, ప్రకృతి వనరుల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి.

అదే సమయంలో బతుకమ్మ చరిత్ర, జానపద సంప్రదాయాలు, మహిళల పాత్ర, ప్రకృతితో దాని అనుబంధాన్ని విద్యార్థులకు పరిచయం చేయాలి. పండుగ పేరుతో జరిగే కార్యక్రమాలు కూడా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా ఉండేలా చూడాల్సిన అవసరం ఉంది.

**పూలను కాపాడితేనే బతుకమ్మను కాపాడినట్టే..**

బతుకమ్మ ఒక పూల గోపురం మాత్రమే కాదు.. అది తెలంగాణ పల్లె బతుకుకు ప్రతిబింబం. ఆ పూల వెనుక రైతు కుటుంబాల జీవనం ఉంది. ఆ పాటల వెనుక తరతరాల మహిళల జ్ఞాపకాలు ఉన్నాయి. ఆ పూలకు జీవం పోసేది తెలంగాణ ప్రకృతి.

అందుకే బతుకమ్మను కాపాడటం అంటే కేవలం వేడుకలను నిర్వహించడం కాదు. పూలు పూసే గుట్టలను కాపాడటం.. నిమజ్జనం చేసే చెరువులను కాపాడటం.. పల్లె మహిళల సంస్కృతిని గౌరవించడం.. బతుకమ్మ అసలు స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించడం.

పూల గోపురం ఎంత ఎత్తుగా ఉన్నా.. దాని కింద తెలంగాణ బతుకు కనిపించకపోతే ఆ వేడుకకు అర్థం ఉండదు. బతుకమ్మకు ఆర్భాటం కంటే ఆత్మ కావాలి.



రావుల రాజేశం
కవి, రచయిత, బహుజన చరిత్ర పరిశోధకుడు,
హైదరాబాద్ 7780185674

# రైతులకు సాగునీరు నిరంతర విద్యుత్ అందించాలి

● సింగిల్ విండో అధ్యక్షుడు కొండల్‌రెడ్డి విజ్ఞప్తి



**హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:**అప్పులు చేసి పంటలు సాగు చేసిన రైతులు పంట చేతికొచ్చే దశలో సాగునీరు, విద్యుత్ కొరతతో ఇబ్బందులు పడుతున్నారని సింగిల్ విండో అధ్యక్షుడు కొండల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. హుజూరాబాద్ నియోజకవర్గ రైతులకు తక్షణమే సాగునీరు అందించడంతోపాటు వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఎల్ ఎండీలో 15 టీఎంసీల నీరు ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు అందకపోవడంపై ఆయన ప్రశ్నించారు. పంట చివరి దశలో నీరు అందకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సాగునీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. రైతుల కష్టాన్ని గుర్తించి పంటలు చేతికొచ్చే వరకు ప్రభుత్వం అండగా నిలవాలని కొండల్‌రెడ్డి కోరారు.

# జనసేనలో చేరిన బీజేపీ పట్టణ అధ్యక్షుడు

**జోగులాంబ గద్వాల్,జోర్దార్ ప్రతినిధి:**జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి బీజేపీ పట్టణ అధ్యక్షుడు బోయ రామకృష్ణ జనసేన పార్టీలో చేరారు. హైదరాబాద్‌లో జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నివాసంలో జిల్లా జనసేన పార్టీ ఇన్‌చార్జి బాసు చిన్న తిమ్మప్ప సమక్షంలో జనసేన కండువా కప్పుకున్నారు.

పవన్ కళ్యాణ్ ఆశయాలు, ప్రజా సంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషికి ఆకర్షితుడై జనసేనలో చేరినట్లు బోయ రామకృష్ణ తెలిపారు. రాను న్న రోజుల్లో అలంపూర్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని పేర్కొన్నారు.




# గద్వాలలో రైస్ మిల్లులపై విజిలెన్స్ మెరుపు దాడులు!



**గద్వాల,(గద్వాల జోరుగా ప్రతినిధి):** జోగులాంబ గద్వాల జిల్లాలో పలు రైస్ మిల్లులపై విజిలెన్స్ అధికారులు మెరుపు దాడులు చేపట్టినట్లు సమాచారం. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ధాన్యం నిల్వలు, ప్రభుత్వానికి బియ్యం అప్పగింతల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో అధికారులు తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది.కోట్ల రూపాయల విలువైన సీఎంఆర్ ధాన్యం మాయమైనట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో అధికారులు ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం. మిల్లుల్లో ధాన్యం నిల్వలు, రికార్డులు, ప్రభుత్వానికి అప్పగించాల్సిన బియ్యం వివరాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. విజిలెన్స్ దాడుల నేపథ్యంలో కొందరు మిల్లు యజమానులు అందుబాటులో లేరనే ప్రచారం కూడా జరుగుతోంది. అయితే తనిఖీల్లో వెల్లడయ్యే వాస్తవాలు, ధాన్యం నిల్వల్లో తేడాలు, బాధ్యులపై తీసుకునే చర్యలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. విజిలెన్స్ తనిఖీలతో రైస్ మిల్లుల వర్గాల్లో కలకలం నెలకొంది. పూర్తిస్థాయి విచారణ అనంతరం సీఎంఆర్ వ్యవహారంలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

ఈ ఆరోపణలపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# ఎన్‌హెచ్‌ఎం సమ్మెతో వైద్య సేవలకు అంతరాయం కలగకుండా చర్యలు



**హనుమకొండ,(జోర్దార్ ప్రతినిధి)**జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో ప్రజలకు వైద్య సేవలు, చిన్నపిల్లల వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమానికి అంతరాయం కల గకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అప్పయ్య ఆదేశించారు.

శనివారం కడిపికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు బోడగుట్ట, వడ్డేపల్లి, సోమిడి పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఆయన ఆకస్మికంగా సంద ర్శించి వైద్య సేవలు, సిబ్బంది హాజరును పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో పలువురు ఉద్యోగులు విధులకు గైర్హాజరైనట్లు గుర్తించారు. అందుబాటులో ఉన్న రెగ్యులర్ ఏఎన్‌ఎంలు, మహిళా సూపర్‌వైజర్ల సహకారంతో టీకాల కార్యక్రమం, ఔట్‌రీచ్ వ్యాక్సినేషన్ సెషన్లను కొనసాగించాలని సూచించారు.అలాగే సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా అవసరమైన ప్రాంతాల్లో ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయాలని, అత్యవసర వైద్య సేవలకు సిబ్బందిని ముందుగానే కేటాయించి మందులు, ప్రథమ చికిత్స సామగ్రిని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రజలకు నిరంతరాయంగా వైద్య సేవలు అందేలా అన్ని వైద్య సంస్థలు సమన్వయంతో పని చేయాలని డాక్టర్ అప్పయ్య స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిత, సూపర్‌వైజరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దసరా సద్దుల బతుకమ్మ పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

● అక్టోబర్ 21 వరకు ఇసుక రవాణా నిలిపివేత

మొగుళ్లపల్లి ఎస్ఐ ఎం. సురేష్

**మొగుళ్లపల్లి అకో జోర్దార్ ప్రతినిది:**మొగుళ్లపల్లి మండల ప్రజలందరికీ మొగుళ్లపల్లి ఎస్ఐ ఎం. సురేష్ దసరా మరియు సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరూ పండుగలను ఆనందోత్సాహాలతో, భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు.

సద్దుల బతుకమ్మ వేడుకల సందర్భంగా బతుకమ్మ ఆడే ప్రదేశాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.




బతుకమ్మ వేడుకల్లో రాజకీయ పార్టీలకు సంబంధించిన పాటలు, ఇతరులను రెచ్చగొట్టే పాటలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే లేదా అవాంఛనీయ సంఘటనలకు ప్రేరేపించే పాటలను డీజే సౌండ్ సిస్టమ్‌ల ద్వారా ప్లే చేయరాదని స్పష్టం చేశారు. బతుకమ్మ వేడుకలకు అనుగుణంగా సంప్రదాయ బతుకమ్మ పాటలను సాధారణ సౌండ్ బాక్సుల ద్వారా మాత్రమే వినిపించాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించి రెచ్చగొట్టే పాటలు ప్లే చేసినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అదేవిధంగా, దసరా పండుగను పురస్కరించుకొని ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా సంబంధిత అధికారుల ఆదేశాల మేరకు అక్టోబర్ 21వ తేదీ వరకు ఇసుక రవాణాను పూర్తిగా నిలిపివేయనున్నట్లు అయన తెలిపారు. ఈ ఆంక్షలను ఉల్లంఘించి అక్రమంగా ఇసుక రవాణా చేసినా, అనుమతులు లేకుండా ఇసుక తరలించినా సంబంధిత వాహనాలను సీజ్ చేయడంతో పాటు బాధ్యులపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుక రవాణా చేసే ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు, ఇసుక వ్యాపారులు పోలీసులకు మరియు సంబంధిత అధికారులకు సహకరించాలని కోరారు.

పండుగల సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా, శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు ఎవరూ పాల్పడరాదని సూచించారు. ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరిస్తూ దసరా, సద్దుల బతుకమ్మ పండుగలను సంతోషంగా, సురక్షితంగా, సోదరభావంతో జరుపుకోవాలని ఎస్ఐ ఎం. సురేష్ పేర్కొన్నారు.

# ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

**జోర్దార్ సైదాపూర్ ప్రతినిధి:**సైదాపూర్ మండలం ఏక్లాస్‌పూర్ గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వెన్నంపల్లి శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్థిక సమ్మిళితత్వం, ప్రధానమంత్రి బీమా పథకాలు, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం, బ్యాంకింగ్ సేవలు, సైబర్ నేరాల నివారణపై నుక్కడ్ నాటకం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ కత్తి శ్రీనివాస్, నాబార్డ్ డీడీఎం జయప్రకాశ్, ఎల్‌డీఎం నందన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వెన్నంపల్లి శాఖ మేనేజర్ అంజన్న కాంపల్లి, ఎఫ్ఐసీ మేనేజర్ అడ్డగట్ల దేవరాజు, సీఎఫ్ఎల్ కౌన్సిలర్ డి. కిషోర్, సర్పంచ్ మేకల భాగ్యలక్ష్మి క్రాంతికుమార్, ఉపసర్పంచ్ తాడవేని కార్తీక్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# సద్దుల బతుకమ్మకు పకడ్బందీ ఏర్పాట్లు

**హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి)** హుజురాబాద్ పట్ట ణంలో సద్దుల బతుకమ్మ వేడుకల కోసం చేపట్టిన ఏర్పాట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు శనివారం పరిశీలిం చారు.

మహిళలు బతుకమ్మ ఆడుకునే ప్రదేశంలో విశా లమైన ఏర్పాట్లు చేయడంతో పాటు, దారిపొ డవునా సిరీస్ లైట్లు ఏర్పాటు చేశారు. తాగునీటికి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ సిబ్బంది చర్యలు చేపట్టారు.పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏసీపీ మాధవి, టౌన్ సీఐ కరుణాకర్, సీఐ శ్రీని వాస్ పర్యవేక్షణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు




● ఎస్ఐ అమూల్య

**టేకుమట్ల జోర్దార్ ప్రతినిధి:**సద్దుల బతుకమ్మ, దసరా పండుగలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలని టేకుమట్ల ఎస్సై అమూల్య సూచించారు. పండుగ వేడుకల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బతుకమ్మ వేడుకల్లో డీజేలు, పార్టీ పాటలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. అలాగే పండుగ సందర్భంగా ఇసుక రవాణాను అనుమతించబోమని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ ఎవరైనా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని, కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ సద్దుల బతుకమ్మ, దసరా పండుగలను సోదరభావంతో, ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై అమూల్య కోరారు. టేకుమట్ల మండల ప్రజలందరికీ బతుకమ్మ దసరా శుభాకాంక్షలు తెలిపారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

ఆదివారం,
అక్టోబర్ 18 2026



## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన సరితా తిరుపతయ్య



గద్వాల,(గద్వాల జోర్దార్ ప్రతినిధి):జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం బురెడ్డిపల్లి గ్రామానికి చెందిన కురువ వీరేష్ ఆత్మహత్య చేసుకొని మృతి చెందడంతో, గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, టీజీఎస్‌జీడీసీఎఫ్ఎల్ చైర్మన్ శ్రీమతి సరితా తిరుపతయ్య ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ముందుగా వీరేష్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఆమె, అనంతరం కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్, అడ్వకేట్ మధుసూదన్, పటేల్ శ్రీనివాసులు, జన్మిచెడు ఆనంద్, సర్పంచులు రఘు, పరిమళ, శివరాజు, సురేష్, ఈరన్న, రామకృష్ణ, పరశురాముడు తదితరులు పాల్గొన్నారు.

## ఊరూర పూల జాతర

ఊరూర బతుకమ్మలు
తీరొక్కపూలతో సింగిడిల్లాగున్నాయి
తెలంగాణ ఆడబిడ్డలు ఆటపాటలతో
నేలతల్లికి నిలువెత్తు బతుకమ్మలతో
హారతులు పడుతున్నారు
ఎల్ నినో ప్రభావంతో
చెరువులన్నీ వెలవెలబోతున్నాయి
నిండుకుండల్లా కళకళలాడే కుంటలన్నీ
గలగల పారే వాగులన్నీ
విలవిల్లాడుతున్నాయి
బతుకమ్మల నిమజ్జనానికి నీళ్లు లేక
కలవర పడుతున్నారు
వర్షాబావ పరిస్థితులతో
పూల జాతరకే కాదు
తాగు సాగు నీటికి కరువచ్చింది.



- గోపగాని రవీందర్
9440979882

## బెల్లంపల్లి స్మశానవాటికలో విద్యుత్తు లైట్లు ఏర్పాటు చేయండి

● మున్సిపల్ అధికారులకు పట్టణ ప్రజల విజ్ఞప్తి.

బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:బెల్లంపల్లి పట్టణ హనుమాన్ బస్తి స్మశాన వాటికలో విద్యుత్తు లైట్లు లేకపోవడంతో చీకట్లో దహన సంస్కారాలు చేయాల్సి వస్తుందని, మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి విద్యుత్తు లైట్లను ఏర్పాటు చేయాలని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

హనుమాన్ బస్తీకి చెందిన ఇరుమళ్ళ శ్రీను, ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన అంత్యక్రియలను విద్యుత్తు లైట్లు లేకపోవడంతో సెల్ఫోన్ లైట్లతో చీకట్లో నిర్వహించాల్సి వచ్చిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

బెల్లంపల్లి పట్టణం అభివృద్ధిలో దూసుకుపోతుందో లేదో తెలియదు కానీ, కనీసం స్మశాన వాటికల్లోనైనా లైట్లు వెలిగేలా చూడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పట్టణంలో రోడ్లు సరిగా లేకపోయినా, మౌలిక సదుపాయాలు అందకపోయినా, ప్రజలు ఎన్నో ఇబ్బందులను భరిస్తున్నారని, అభివృద్ధి జరిగినా, జరగకపోయినా ఉన్న పరిస్థితుల్లో సర్దుకుపోతున్నారనీ, ఆత్మీయులను కోల్పోయిన బాధలో ఉన్న



కుటుంబాలకు అంత్యక్రియల సమయంలోనైనా కనీస వెలుతురు కల్పించకపోవడం దురదృష్టకరమని,ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం పాలకుల బాధ్యత కాదా? అని ప్రశ్నిస్తున్నారు.

పార్టీలకు అతీతంగా స్పందించి బెల్లంపల్లి స్మశాన వాటికల్లో లైట్లు ఏర్పాటు చేసి, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించిన ఎంపీఓ, సర్పంచ్



రామగిరి జోర్దార్ ప్రతినిధి:రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లను శనివారం రామగిరి ఎంపీ ఓ మోతే సమ్మిరెడ్డి సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావులు శనివారం పరిశీలించారు. గ్రామంలో వాగు ప్రాంతంలో జెసిబి సహాయంతో నిమజ్జన ఏర్పాట్లను చేశారు. ఆదివారం రాత్రి బతుకమ్మ పండుగ ముగింపు సందర్భంగా బతుకమ్మ ఆడిన తర్వాత మహిళలు ఈ ప్రాంతంలో నిమజ్జనం చేస్తారు. లైటింగ్ కూడా ఏర్పాటు చేయనున్నారు. బతుకమ్మ పండుగ ఘనంగా జరుపుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భద్రపు ప్రవళిక ప్రశాంత్, పంచాయతీ సెక్రెటరీ గంగుల సంతోష్, స్థానిక నాయకులు పబ్బా వెంకటేష్, జక్కుల చందన్, ఖండే గట్టయ్య, సందేవెన కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రెజ్లింగ్ పోటీల్లో అచ్చులాపూర్ విద్యార్థినికి బ్రాంచ్ బ్రాంజ్ పథకం

● పిడి ఏ, సాంబమూర్తి.

బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:ఎస్ జి ఎఫ్ అండర్ –17 రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో జిల్లా పరిషత్ హైస్కూల్ అచ్చులాపూర్ విద్యార్థిని కె. శ్రీవల్లి బ్రాంజ్ మెడల్ సాధించినట్లు పిడీ ఏ, సాంబమూర్తి తెలిపారు.

పాఠశాల క్రీడా సమాఖ్య వారి ఆధ్వర్యంలో ఈనెల 14 నుండి 16 వరకు సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మైత్రి గ్రౌండ్ లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో శ్రీవల్లి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బ్రాంజ్ మెడల్ (3వ స్థానము) సాధించిందని మెడల్ సాధించిన విద్యార్థినిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి ఉమాదేవి, ఏఏపిసి చైర్మన్ చిలకమ్మ,సర్పంచ్ మారిశెట్టి స్రవంతిశ్రీనివాస్ , ఉపసర్పంచ్ గట్టు సంతోష్, వార్డు సభ్యులు పాపయ్యా, గ్రామ పెద్దలు ఉపాధ్యాయ బృందం, తదితరులు అభినందించారు.



## ఎక్తా నగర్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు



హైదరాబాద్ జోర్దార్ ప్రతినిధి:గుజరాత్ రాష్ట్రంలోని నర్మదా జిల్లా ఏక్తా నగర్ లో గల సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం దగ్గర హనుమకొండ జిల్లాకు చెందిన విహారి విజ్ఞాన యాత్ర మహిళా బృందం ఘనంగా బతుకమ్మ సంబరములను అంగ రంగ వైభవముగా జరుపుకున్నారు .తీరొక్క పూలను పేర్చి "రామ రామ ఉయ్యాలో శ్రీరామ ఉయ్యాలో "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలలో మా మంచి బతుకమ్మ ఉయ్యాలో తదితర పాటలు పాడుతూ బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గుజరాతీలు ఈ సంబరాలను చూసి తన్మయత్నం చెందారు .తెలంగాణ సాంస్కృతికి సాంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని బతుకమ్మ సంబరాలను గుజరాత్ లో జరుపుకోవడం ఆనందంగా ఉందని మహిళా సోదరి మణులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విహారి సమితి అధ్యక్షులు దావు రమేష్ ప్రధాన కార్యదర్శి కామిడి సతీష్ రెడ్డి కోశాధికారి పొగాకుల రాధాకృష్ణ మాజీ బాధ్యులు చందా రాజేందర్ పల్లా పరమేశ్వర్ కామిడి శ్రీధర్ రెడ్డి కొత్వాల్ వెంకటకృష్ణ గొట్టముక్కుల రవి తదితరులు పాల్గొన్నారు

## మిత్రుని కుటుంబానికి 20,000 ఆర్థిక సహాయం అందజేత



టేకుమట్ల జోర్దార్ ప్రతినిధి:కాలం ఎంత దూరం తీసుకెళ్లిన జీవిత ప్రయాణంలో కొన్ని స్నేహ బంధాలు తోడై ఉంటాయి అలాంటి అరుదైన స్నేహానికి నిదర్శనంగా తోటి మిత్రులు అండగ నిలిచారు టేకుమట్ల మండలం వెలిశాల జడ్.పి .హెచ్.ఎస్ పాఠశాలలో 2003–04 బ్యాచ్ మిత్రుడు అచ్చే సతీష్ మరణించడంతో వారి కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు విషాద వార్త తెలుసుకున్న తోటి మిత్రులు సతీష్ కుటుంబానికి ధైర్యం చెబుతూ బాధలో తాము అండగా ఉంటామని భరోసా కల్పించి 20,000 ఆర్థిక సహాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు 22 సంవత్సరాల క్రితం ఒకే తరగతి గదిలో కలిసి చదువుకున్న మిత్రులు నేడు కష్టకాలంలో ఒకరి కోసం ఒకరు నిలబడటం వారి కుటుంబ సభ్యులను భావోద్వేగానికి గురి చేసింది స్నేహమంటే జ్ఞాపకాలు కాదు అవసరమైన సమయంలో అండగా నిలబడడమే అని ఈ సంఘటన నిరూపించింది స్నేహితులు ఉంటే దుఃఖం సగమే అండగా నిలిచే మనుషులు ఉంటే జీవితం ధైర్యంగా ముందుకు సాగుతుందని నిరూపించారు సతీష్ కుటుంబ సభ్యులు తమ బాధను పంచుకుంటూ ఆర్థిక సహాయం అందించిన మిత్రులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో తోటి మిత్రులు ఆకునూరి సతీష్ కన్నూరి రమేష్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## శివసాయి సంస్థలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



● కోలాటాలు, ఆటపాటలతో సందడిగా మహిళా ఉద్యోగుల వేడుకలు

పెద్దపల్లి, జోర్దార్ ప్రతినిధి:తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలను శివసాయి సంస్థ పెద్దపల్లి శాఖలో శనివారం (అక్టోబర్ 17) ఘనంగా నిర్వహించారు. సంస్థ చైర్మన్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ వేడుకల్లో మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని కోలాటాలు, ఆటపాటలతో సందడి చేశారు.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, పూల పండుగ వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. మహిళా ఉద్యోగులంతా కలిసి బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. కార్యాలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ నాగుల కమలతో పాటు ఉద్యోగులు కళ్యాణి, సాయి ప్రియ, భాగ్య, ప్రీతి, రోజా రాణి, శ్రీలత, జీవిత, స్వాతి, లక్ష్మి, కవిత తదితరులు పాల్గొన్నారు. మహిళా ఉద్యోగుల సమష్టి భాగస్వామ్యంతో బతుకమ్మ సంబరాలు విజయవంతంగా ముగిశాయి.




## మంత్రి శ్రీధర్ బాబుకు కలెక్టర్ సత్య శారద శుభాకాంక్షలు



జోర్దార్ ప్రతినిధి, వరంగల్:వరంగల్ పర్యటనకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును వరంగల్ జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ సత్య శారద దేవి ఐఏఎస్ మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా మంత్రికి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యార్థులు ఫ్యూచర్ ఇన్నోవేటర్స్ ఛాలెంజ్‌లో పాల్గొనాలి

● నవంబర్ 6లోగా ఆలోచనలు,ప్రాజెక్టుల సమర్పణ

వరంగల్,(జోర్దార్ ప్రతినిధి)విద్యార్థుల్లో సృజనాత్మకత, నూతన ఆలోచనలు, శాస్త్రీయ దృక్పథం, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించేందుకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో తెలంగాణ ఫ్యూచర్ ఇన్నోవేటర్స్ చాలెంజ్ 2026--27 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రశాంత్ రెడ్డి తెలిపారు.

వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ,స్థానిక సంస్థలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, తెలంగాణ మోడల్ స్కూల్స్ తదితర పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు



ఇందులో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

విద్యార్థులు తమ పరిసరాల్లోని సమస్యలను గుర్తించి,వినూత్న పరిష్కారాలతో కూడిన ఆలోచనలు,ప్రాజెక్టులను వ్యక్తిగతంగా లేదా ముగ్గురు సభ్యులకు మించని బృందంగాసమర్పించవచ్చని తెలిపారు.ప్రాజెక్టుల సమర్పణకు అక్టోబర్ 15 నుంచి నవంబర్ 6, 2026 వరకుగడువు ఉందన్నారు.

విద్యార్థులు [telangana.codemitra.org](https://telangana.codemitra.org) వెబ్‌సైట్‌లో ఆలోచనలను నమోదు చేయాలని సూచించారు.

ఉత్తమ ప్రాజెక్టులకు గుర్తింపు లభిస్తుందని వివరించారు.

ఎంపికైన మొదటి రెండు ప్రాజెక్టులకు పరిశ్రమల నిపుణుల మార్గదర్శ కత్వంతో పాటు కోడింగ్, కృత్రిమ మేధస్సు సాయంతో మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు కార్యక్రమంపై విస్తృత ప్రచారం కల్పించి,అర్హులైన విద్యార్థులను ప్రోత్సహించాలని డీఈఓ సూచించారు. పూర్తి వివరాలకు అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ మహేష్ నాయక్ లేదా జిల్లా సైన్స్ అధికారి పి. సురేష్ బాబును సంప్రదించాలని తెలిపారు.

# గ్రామాలలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు

## మామూళ్ల మత్తులో అధికారులు

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో, పట్టణాలలో పుట్టగొడుగుల్లా బెల్టు దుకాణాలు మద్యం ను విక్రయిస్తున్నాయి . మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతూ వున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుగు తున్నాయు పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా ఏరులై పారుతున్న అన్నీ తెలిసినా అటువైపు కన్నెత్తిచూడ కుండా ఎక్సైజ్ అధికారులు వ్యవహరించడం జరుగుతుందని ఆరోపణలు వినవస్తోంది. అన్ని జిల్లాలలో బెల్టు షాపుల దందా జోరుగా సాగుతోంది. పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా కిరాణాదుకాణం నుంచి మొదలుకొని నివాసగృహాలు, పాన్ షాపులు, కల్లు కాంపౌండ్‌ల సమీ పంలో మద్యం ఏరులై పారు తోంది. భవననిర్మా ణ కార్మికులు, కూలీలు, హోటల్‌లు, ఇసుక రవాణా కార్మికులకు తెల్లవారు జామునే మద్యం అందిస్తూ బెల్టు దందాను మూడు క్వార్టర్లు, ఆరు ఆఫ్‌లుగా సాగిస్తున్నారు. గతంలో వైన్ షాపుల పరిసరాలలో కొనసాగిన ఈ దందా ప్రస్తుతం గల్లీకొకటి ఏర్పాటు కావడంతో మ ద్యం ప్రియులు ఉదయం టీ, కాఫీల కు బదులుగా మద్యంను తాగుతూ ఎక్కడ పడితే అక్కడ పడిపోతూ గాయాలపాలవుతున్నారు. కొన్ని ప్రాంతాలలో ప్రత్యేకంగా ఉదయం పూట వాహనాలలో తీసుకువచ్చి, ఆ ప్రాంతం లోనే ఓ కల్లు కాంపౌండ్ పరిసరాలలో పలువురు పాన్‌షాపులు ఏర్పాటుచేసి అందులో బెల్టుదుకాణం నడిపిస్తున్నారు. ఈ విషయం ఎక్సైజ్ అధికారులకు తెలిసినా అటు వైపు కన్నెతి చూడడం లేదనే విమర్శలు ఉన్నాయి.గుడుంబా విక్రయాలు మానేసిన వారికి ప్రభుత్వం ఓవై పు స్వయం ఉపాధి మార్గాలతో జీవనోపాధి కల్పిస్తుంటే, మరో వైపు బెల్టు దుకాణాలు పల్లెలు, పట్టణ ప్రజలను మత్తులో ముంచుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో బెల్టు దుకాణాలు కొనసాగుతున్నా.. చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోందన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.లిక్కర్ డాన్లు వివిద జిల్లాల్లో కమీషన్లకు బెల్టు షాపుల వారికి మద్యం సరఫరా చేస్తున్నారు. రోజుకు ఎంత అమ్మితే అంత కమీషన్లు అందిస్తుండడంతో బెల్టుషాపుల నిర్వాహకులు ఒకరిని చూసి మరొకరు ఈ దందాను జీవనోపాధిగా చేసుకుంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ దందాను బహిరంగంగా కొనసాగిస్తూ ప్రజలను మత్తులో ముంచుతున్నారు. ఆ మద్యం తాగిన వ్యక్తులు వాటికి బానిసలై తమ ఆరోగ్యాలను పాడుచేసుకుంటున్నారు.ఒకప్పుడు నగరాలు ,పట్టణ ప్రాంతాలకే పరిమితమైన ఈ దందా ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లోనూ విచ్చలవిడిగా కొనసాగు తోంది. ఓవైపు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో బెల్టు దుకాణాలపై ఉక్కుపాదం మోపుతున్నామని అధికారులు ప్రకటిస్తుంటే.. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో యథేచ్ఛగా బెల్టుదుకాణాలు కొనసాగుతున్నాయి. కొత్త మద్యం విధానం అమల్లోకి వచ్చిన ఈ కొద్ది రోజుల్లోనే గ్రామాల్లో బెల్టుదుకాణాలు జోరందుకున్నాయంటే పరిస్థితి ఏవిధంగా ఉందో ఇట్టే అర్థమవుతుంది. ఒక్కో గ్రామంలో పదుల సంఖ్యలోనే మద్యం షాపులు కొనసాగుతున్నాయి.




వివిధ మండలంలలోని కొన్ని గ్రామంలలో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠినంగా వ్యవహరిస్తామని గ్రామస్థులు ఏకగ్రీవ తీర్మానం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రెండు లక్షల బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని తెలుస్తుంది.అందులో బాటిళ్లను ఎంఆర్‌పీ కంటే రూ.50 నుంచి రూ.100 వరకు ఎక్కువకు విక్రయిస్తున్నారు.. కొందరైతే వాహనాల ను ఉదయం సమయంలో తీసుకువచ్చి అడ్డకూలీలకు, ఇసు క ట్రాక్టర్ల మీద వెళ్లే కూలీలకు అమ్మకాలు జరుపుతున్నారు.వివిధ ప్రాంతాల్లోని కల్లు కాంపౌండ్ల వద్ద గల కిరాణా దుకాణాల లో కల్తీమద్యం అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆ డుతున్నారని తెలుస్తోంది.అన్నిజిల్లాలలో ఈ దందా సంగతి తెలిసిన సంబంధిత శాఖ అధికారులు నిమ్మకు నిరేత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. కొందరు సిబ్బందికి ప్రత్యేకంగా వారం, నెలకు చొప్పున ముడుపులు అందుతుండడంతో ఏదైనా ఫిర్యాదు రాగానే బెల్టు షాపుల నిర్వాహకులకు సమాచారం అందించి తనిఖీల విషయాలను చేరవేస్తున్నారు. దీంతో అప్రమత్తం అవుతున్న బెల్టు షాపుల వారు తనిఖీలలో ఏమీ దొరకకుండా జాగ్రత్త పడుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారిస్తేనే ఈ బెల్టుదందాకు అడ్డుకట్టప డడమే కాకుండా ప్రజల ఆరోగ్యాలకు రక్షణ కల్పించిన వార వుతారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.యువత మాత్రం నిత్యం వీనికి బానిస ఆయి ఒళ్లు గుల్ల చేసుకుని భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారు.ప్రజల ఆరోగ్యం పూరిగా దెబ్బతింటూశీది.ఇకనయినా ప్రభుత్వం ,సంబంధిత అధికారులు దృష్టి సారించాలి.బెల్ట్ షాప్ నిర్వాహకుల మీద ఉక్కు పాదం మోపాలి.

"కామిడి సతీష్ రెడ్డి జడలపేట,
జయశంకర్ భూపాలపల్లి జిల్లా.
9848445134. తెలంగాణ సామాజిక
రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు.

# కాట్రపల్లిలో పశువుల చోరీ

హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి)హుజురాబాద్ మండలం కాట్రపల్లి గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు మూడు బర్రెలను అపహరించుకెళ్లారు. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటనతో గ్రామంలో కలకలం రేగింది.గ్రామానికి చెందిన తాళ్లపల్లి భగవాన్‌కు చెందిన రెండు బర్రెలు, జంపాల శ్రీనివాస్‌కు చెందిన ఒక బర్రెను దుండగులు ఎతుకెళ్లారు. ఉదయం పశువులు కనిపించకపోవడంతో బాధితులు ఆందోళనకు గురయ్యారు.పశువుల ఆచూకీ తెలిసినవారు బాధితులకు లేదా గ్రామ పెద్దలకు సమాచారం అందించాలని గ్రామస్తులు కోరారు. పాడి రైతులు అప్రమత్తంగా ఉండి, రాత్రివేళ పశువుల కొట్టాల వద్ద తగిన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.



# గంజాయి సేవించిన ముగ్గురు

## యువకులను పట్టుకున్న పోలీసులు

- వైద్య పరీక్షల అనంతరం పునరావాస కేంద్రానికి తరలింపు

(వీణవంక, జోర్దార్ ప్రతినిధి)గంజాయి సేవించిన ముగ్గురు యువకులనుపట్టుకున్న వీణవంక పోలీసులు, ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం వీణవంక మండలం ఘన్ముక్ల గ్రామ శివారులో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఘన్ముక్ల గ్రామానికి చెందిన గాజుల సన్నీ (21), కనుకుంట్ల రుత్విక్ (20), గాజుల సిద్ధార్థ (19)గా పోలీసులు గుర్తించారు.వారికి నిర్వహించిన మూత్ర పరీక్షల్లో గంజాయి వినియోగానికి సంబంధించిన టీ ఎచ్ సీ పాజిటివ్‌గా వచ్చినట్లు వారు తెలిపారు.పంచనామా, వైద్య పరీక్షల అనంతరం ముగ్గురినీ న్యాయస్థానంలో హాజరుపరిచి, పునరావాసం కోసం మత్తు పదార్థాల వ్యసన విముక్తి కేంద్రానికి తరలించినట్లు ఎస్ఐ ఆవుల తిరుపతి వెల్లడించారు.




# రైతుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

- విద్యుత్ కోతలు, సాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- బీజేవైఎం లిజిల్లా అధ్యక్షుడు సంఘ నరేష్

హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి)హుజురాబాద్ బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో రైతుల సమస్యలపై రైతు సన్నాహక సమావేశాన్ని పెద్దపాపయ్యపల్లి రోడ్డులోని విశేష ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సంఘ నరేష్ రైతులను ఉద్దేశించి మాట్లాడారు.రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ కోతలు, సాగునీటి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. పంటల సాగు సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా లేకపోవడం, సాగునీరు అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందించడంతో పాటు సాగునీటి వనరులను సమర్థవంతంగా వినియోగించి రైతులకు నీరు అందించాలని కోరారు.



కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, క్షేత్రస్థాయిలో వారి సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాల కోసం బీజేపీ నిరంతరం పోరాడుతుందని పేర్కొంటూ, ఈ నెల 23 న కరీంనగర్ కలెక్టరేట్ వద్ద నిర్వహించే రైతు నిరసన కార్యక్రమంలో రైతులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు.
ఈ సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు రావుల వేణు, మాజీ పట్టణ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు, ప్రధాన కార్య దర్శి తిప్పబత్తిని రాజు, గంట సంపత్, నరాల రాజశేఖర్, కొలిపాక శ్రీనివాస్, ఎండీ అజార్, పడాల కొమురయ్య, డోరి అయిలయ్య, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# కారు--ఆటో ఢీ..

## పలువురికి తీవ్ర గాయాలు

గద్వాల,జోర్దార్ ప్రతినిధి :జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలంలో బొంకూరు, కలుగొట్ల గ్రామాల మధ్య కారు,ఆటో ఢీకొన్న ప్రమాదంలో పలువురు గాయపడ్డారు.
ఈ ఘటనలో ఓ యువతికి కాలు విరగగా, ఆటో డ్రైవర్‌కు రెండు కాళ్లు విరిగినట్లు సమాచారం. మరో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలు, క్షతగాత్రుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# చెకుముకి సంబురాలను విజయవంతం చేయండి



(వరంగల్ జోర్దార్ ప్రతినిధి) విద్యార్థులలో సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొం దించే చెకుముకి సంబరాలను విజయవంతం చేయాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ డాక్టర్ రజిని పిలుపునిచ్చారు. జన విజ్ఞాన వేదిక జిల్లా స్థాయి విస్తృత సమావేశం జన విజ్ఞాన వేదిక భవన్ లో శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ధర్మ ప్రకాష్ అధ్యక్షత వహించగా ఆమె ముఖ్య అతిథి గా పాల్గొని ప్రసంగించారు. చెకుముకి సంబురాలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని అన్ని పాఠశాలల విద్యార్థులకు నిర్వహించే విధంగా కృషి చేయాలని సూచించారు ప్రజల కోసం సైన్స్ ప్రగతి కోసం సైన్స్ అనే జేవివి ఉద్దేశ లక్ష్యాలను సమాజంలోకి తీసుకెళ్లి గ్రామీణ ప్రాంత ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జితేందర్ మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథం చిన్ననాటి నుంచి అలవచినప్పుడు మూఢనమ్మకాలు సమాజం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చెకుముకి నిర్వహణ విజయవంతం చేయడానికి మండల స్థాయి బాధ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర నాయకులు నిట్ ప్రొఫెసర్లు ఎల్ కృష్ణానంద్, ఎల్ ఆంజనేయులు, వి. రమ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ అజయ్ కుమార్ ఉమామహేశ్వరరావు, వి. శ్రీనివాస్ జి రమేష్, రెహమాన్, సునీత, డాక్టర్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్రలేఖన విజేతలకు

## బహుమతుల ప్రధానోత్సవం



- బతుకమ్మ పండుగ సందర్భంగా జిల్లా స్థాయి పోటీలు..
- విద్యార్థులను అభినందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

(కరీంనగర్ జోధార్ ప్రతినిధి)బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీల విజేతలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ బహుమతులు అందజేశారు.
ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులను, పోటీల నిర్వాహకులను ఆయన అభినందించారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆర్ట్, ఫిజికల్, వర్క్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ (టి-ఏపీవెటా) జిల్లా అధ్యక్షుడు తాడూరి లక్ష్మీనారాయణ, పబ్బతి రఘు, రౌతు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ ఘాట్ ప్రారంభం..

## శిలాఫలకాలపై వివాదం!



- సర్పంచ్, వార్డు సభ్యుల మధ్య వాగ్వాదం.. గ్రామ పంచాయతీకి శిలాఫలకాలు తరలింపు

(వీణవంక, జోర్దార్ ప్రతినిధి)వీణవంక మండలం బేతిగల్ గ్రామంలోని ఊర చెరువు కట్టపై నూతనంగా నిర్మించిన బతుకమ్మ ఘాట్, బతుకమ్మ విగ్రహాన్ని శనివారం సర్పంచ్ చొప్పరి సారమ్మ - సారయ్య ప్రత్యేక పూజలు నిర్వహించి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.గ్రామ ప్రజలు సౌకర్యవంతంగా బతుకమ్మ వేడుకలు జరుపుకునేందుకే వీటిని నిర్మించినట్లు వారు తెలిపారు.
ప్రారంభోత్సవం అనంతరం శంకుస్థాపన శిలాఫలకాలపై దాతల పేర్లతో పాటు ఇతరుల పేర్లు ఉండటంపై వివాదం తలెత్తింది. శిలాఫలకాల బోర్డులను తొలగించాలని ఉపసర్పంచ్ మడ్డి మహేష్‌తో పాటు వార్డు సభ్యులు డిమాండ్ చేయడంతో సర్పంచ్, వార్డు సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. చివరకు శిలాఫలకాలను గ్రామ పంచాయతీకి తరలించారు.ఈ వివాదం గ్రామంలో చర్చనీయంగా మారింది.

# తెలంగాణ ఆడబిడ్డలకు

## కేసీఆర్ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ ముగింపు వేడుకలైన సద్దుల బతుకమ్మ ఘనంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా తెలంగాణ ఆడబిడ్డలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శనివారం శుభాకాంక్షలు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు ఆడబిడ్డల ఆటపాటలతో సాగిన బతుకమ్మ సంబురాలతో తెలంగాణ వ్యాప్తంగా సందడి నెలకొందన్నారు.'మల్లారావమ్మా బతుకమ్మా.. మా బతుకులు బాగు చేయవమ్మా' అని కోరుకుంటూ బతుకమ్మకు వీడ్కోలు పలుకుతూ ఘనమైన తెలంగాణ సాంస్కృతిక వేడుకలను ఆడబిడ్డలు ముగిస్తారని కేసీఆర్ తెలిపారు.



రాష్ట్ర సాధనలో, తెలంగాణ ప్రగతిలో మహిళల భాగస్వామ్యం మహోన్నతమైనదని, వారి కృషిని త్యాగాలను గుర్తించిన నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం వారి సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేసిందని గుర్తు చేశారు.

ఆదివారం,
అక్టోబర్ 18 2026

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం



## రెండు మూడు సినిమాలతో కనిపించకుండా మాయం అయ్యింది.



తెలుగు సినీ పరిశ్రమలో కొంతమంది నటీనటులు తమ అందం, అభినయంతో ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటారు. అయితే వరుసగా సినిమాలు చేసినప్పటికీ, కొంతకాలం తర్వాత వెండితెరకు దూరమవుతుంటారు. అలాంటి నటీమణుల్లో ఒకరు సలోని. ఒకప్పుడు తెలుగు ప్రేక్షకులను తన అందంతో, నటనతో ఆకట్టుకున్న ఈ భామ.. ముఖ్యంగా సునీల్ హీరోగా నటించిన మర్యాద రామన్న సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. అప్పట్లో ఆమెను చూసిన ప్రేక్షకులు ఇప్పుడు ఆమె ఎలా ఉందో తెలుసుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. కమెడియన్‌గా తెలుగు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన సునీల్.. ఆ తర్వాత హీరోగా మారి తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. ఆయన హీరోగా నటించిన అందాల రాముడు మంచి గుర్తింపు తెచ్చిపెట్టగా, దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కించిన మర్యాద రామన్న ఆయన కెరీర్‌లో మరో కీలక చిత్రంగా నిలిచింది. 2010లో విడుదలైన ఈ సినిమా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. సాధారణ కథకు భిన్నమైన నేపథ్యం, ఆసక్తికరమైన కథనం, కామెడీతో పాటు ఉత్కంఠను కలగలిపిన తీరు ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కమెడియన్‌గా తెలుగు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన సునీల్.. ఆ తర్వాత హీరోగా మారి తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. ఆయన హీరోగా నటించిన అందాల రాముడు మంచి గుర్తింపు తెచ్చిపెట్టగా, దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కించిన మర్యాద రామన్న ఆయన కెరీర్‌లో మరో కీలక చిత్రంగా నిలిచింది. 2010లో విడుదలైన ఈ సినిమా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. సాధారణ కథకు భిన్నమైన నేపథ్యం, ఆసక్తికరమైన కథనం, కామెడీతో పాటు ఉత్కంఠను కలగలిపిన తీరు ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా

## ఎలాంటి డైట్ లేదు.. ఇంత ఫిట్‌గా ఉండటానికి కారణం అదే



బాలనటిగా సినీరంగ ప్రవేశం చేసి, ఆ తర్వాత సౌత్ ఇండియన్ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న అందాల తార హన్సిక మోత్వానీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అప్పట్లో 'శాకా లకా బూమ్ బూమ్' సీరియల్ తో పాటు తెలుగు, తమిళ చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన హన్సిక, ప్రస్తుతం 34 ఏళ్ల వయసులోనూ అంతే అందంగా, ఫిట్‌గా కనిపిస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. అయితే ఆమె అంత ఫిట్‌గా ఉండటానికి ఎలాంటి కఠినమైన డైట్ లేదా వర్కౌట్లు ఫాలో అవుతుందనే విషయంపై తాజాగా ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.సాధారణంగా నటీమణులు అంటే కఠినమైన డైట్ చార్ట్స్, గంటల తరబడి జిమ్‌లో కసరత్తులు చేస్తుంటారని భావిస్తారు. కానీ హన్సిక మోత్వానీ మాత్రం తాను ఎలాంటి స్ట్రిక్ట్ డైట్ ఫాలో కానని స్పష్టం చేశారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తన ఫిట్‌నెస్ రహస్యాన్ని పంచుకుంటూ.. తాను ఫిట్‌గా ఉండటానికి ప్రధానంగా 'పిలేట్స్' వర్కౌట్ ఎక్కువగా చేస్తానని తెలిపారు. శరీరాన్ని వంచడం, ఫ్లెక్సిబిలిటీ పెంచుకోవడం , కోర్ స్ట్రెంత్ కోసం పిలేట్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆమె పేర్కొన్నారు.సాధారణంగా నటీమణులు అంటే కఠినమైన డైట్ చార్ట్స్, గంటల తరబడి జిమ్‌లో కసరత్తులు చేస్తుంటారని భావిస్తారు. కానీ హన్సిక మోత్వానీ మాత్రం తాను ఎలాంటి స్ట్రిక్ట్ డైట్ ఫాలో కానని స్పష్టం చేశారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తన ఫిట్‌నెస్ రహస్యాన్ని పంచుకుంటూ.. తాను ఫిట్‌గా ఉండటానికి ప్రధానంగా 'పిలేట్స్' వర్కౌట్ ఎక్కువగా చేస్తానని తెలిపారు. శరీరాన్ని వంచడం, ఫ్లెక్సిబిలిటీ పెంచుకోవడం , కోర్ స్ట్రెంత్ కోసం పిలేట్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆమె పేర్కొన్నారు.సాంప్రదాయకంగా జిమ్‌లో చేసే హెవీ వెయిట్ లిఫ్టింగ్ కంటే తన సొంత శరీర బరువుతో చేసే వర్కౌట్లకే హన్సిక ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. ఉదయాన్నే నిద్రలేచి జిమ్‌కి జాగింగ్ చేస్తూ వెళ్లడం ఆమె దినచర్యలో భాగం. జిమ్‌లో బరువులు ఎత్తడం తనకు బోర్ కొడుతుందని, అందుకే బాడీ వెయిట్ ఎక్సర్‌సైజెస్‌తో పాటు స్విమ్మింగ్, సైక్లింగ్, యోగా వంటి వాటిని తన రొటీన్‌లో చేర్చుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా యోగా చేయడం వల్ల మనసు ప్రశాంతంగా ఉండటంతో పాటు ఒత్తిడి దూరమవుతుందని ఆమె వెల్లడించారు.

## అమ్మాయి, అబ్బాయి ఎవరైనా సరే నచ్చితే పెళ్లి చేసుకుంటా.



తెలుగు ప్రేక్షకులకు నటి స్నిగ్ధ నయని గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. తనదైన నటనతో, విభిన్నమైన హావభావాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆమె.. సినిమాల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ముఖ్యంగా ప్యాంట్, షర్ట్ వేసుకొని మగరాయుడిలా కనిపిస్తూ తనదైన శైలిలో నటించి మెప్పించారు. అయితే ఇటీవల ఆమెకు సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అందులో ఆమె ఓ అమ్మాయిని పెళ్లి చేసుకున్నట్లుగా కనిపించడంతో నెటిజన్లు రకరకాలుగా చర్చించుకున్నారు. తాజాగా ఈ వీడియోపై స్నిగ్ధ స్పందిస్తూ అసలు విషయం వెల్లడించారు. స్నిగ్ధ నయని అలా మొదలైంది సినిమాతో తన సినీ ప్రయాణాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత మేం వయసుకు వచ్చాం, దమ్ము, ప్రేమ ఇష్క్ కాదల్, 'చందమామ కథలు', 'టైగర్', 'కళ్యాణ వైభోగమే, ఓ బేబీ వంటి చిత్రాల్లో నటించి తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. తనకు వచ్చిన పాత్రల్లో ప్రత్యేకత చూపిస్తూ మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. ప్రస్తుతం సినిమాల్లో పెద్దగా కనిపించకపోయినా, సింగర్‌గా పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.ఇటీవల స్నిగ్ధ నయని ఓ అమ్మాయిని పెళ్లి చేసుకున్నట్లుగా ఉన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో ఆమె నిజంగానే పెళ్లి చేసుకున్నారా? అంటూ చాలామంది ప్రశ్నలు లేవనెత్తారు. ఈ నేపథ్యంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, ఆ వీడియో వెనుక ఉన్న అసలు విషయాన్ని వివరించారు. చిన్న చిన్న గొడవలకే ప్రేమలో ఉన్నవారు విడిపోతున్నారని, అలా చేయకుండా మంచి

## జైలర్ 2 బాక్సాఫీస్ సునామీ.. రజినీకాంత్ తొలి రోజు కలెక్షన్స్ రికార్డులు బద్దలు..




సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా తెరకెక్కిన సంచలన విజయం సాధించిన 'జైలర్' చిత్రానికి సీక్వెల్‌గా వచ్చిన లేటెస్ట్ మూవీ 'జైలర్ 2' (జీుఱశ్రీవతీ 2). ముందు నుంచి ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంపై టాలీవుడ్, కోలీవుడ్ వర్గాల్లో విపరీతమైన క్రేజ్ ఉంది. ఈ క్రమంలో అక్టోబర్ 15న ఈ చిత్రం అడియన్స్ ముందుకు వచ్చింది. తాజాగా ఈ సినిమా మొదటి రోజు బాక్సాఫీస్ కలెక్షన్లకు సంబంధించిన అంచనాలు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. రజినీకాంత్ నటనతో బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించిన లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలోని 'కూలీ' చిత్రం తొలి రోజు ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 151 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించి అప్పట్లో సరికొత్త రికార్డు సృష్టించింది. అయితే, ఇప్పుడు 'జైలర్ 2' సినిమా ఆ రికార్డును అధిగమించింది. మొదటి భాగం ఇచ్చిన హైప్ కారణంగా, సీక్వెల్‌పై అంచనాలు తారాస్థాయికి చేరాయి.మొదటి భాగంలో టైగర్ ముత్తువేల్ పాండియన్ పాత్రలో రజినీకాంత్ చూపించిన మాస్ యాక్షన్ , అనిరుధ్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ సినిమాను వేరే లెవెల్‌కు తీసుకెళ్లాయి. ఇప్పుడు 'జైలర్ 2' చిత్రంలో మరింత పవర్‌ఫుల్ యాక్షన్ ఎపిసోడ్స్, హై-వోల్టేజ్ డ్రామా ఉండనున్నట్లు తెలుస్తోంది. సినిమా విడుదలైన మొదటి రోజే వంద కోట్ల క్లబ్‌లో చేరడంతో పాటు, ప్రీ-సేల్స్ ద్వారా సరికొత్త సంచలనాలు సృష్టించడానికి ఈ చిత్రం సిద్ధమవుతోంది.

నివేదికల ప్రకారం ఈ సినిమా తొలిరోజే రూ. 100 కోట్లకు పైగా వసూలు చేస్తుందని సినీ పరిశ్రమ నిపుణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ సినిమాతో బాక్సాఫీస్ వద్ద రజినీకాంత్ మరోసారి తన స్టామినా ఏంటో నిరూపించనున్నారు.ఈ వసూళ్లపై క్లారిటీ రావాలంటే నిర్మాణ సంస్థ అయిన సన్ పిక్చర్స్ చేసిన ప్రకటనలోనే ఉంది. రజినీకాంత్ గత చిత్రం 'కూలీ'ని కూడా సన్ పిక్చర్స్ నిర్మించిందన్నది గమనార్హం.

## నవరసాలు పండిస్తున్న ఆ కంటెస్టెంట్.



అంచనాలకు తగ్గట్టుగానే బిగ్ బాస్ తెలుగు సీజన్ 10 రసవత్తరంగా, ఆసక్తికరంగా సాగుతోంది. సెప్టెంబర్ 07న ప్రారంభమైన ఈ రియాలిటీ షో ఇప్పటికే సక్సెస్ ఫుల్ గా ఐదు వారాలు కంప్లీట్ చేసుకుంది. ఇక ఆరోవారం కూడా దాదాపు ఎండింగ్ కు వచ్చేసింది. ఇక మొదటి వారంలో చైత్ర, చరణ్ ఎలిమినేట్ అయ్యారు. అయితే వీరిలో చరణ్ మళ్లీ రీఎంట్రీ ఇచ్చాడు. రెండో వారంలో కృష్ణుడు బిగ్ బాస్ హౌస్ నుంచి బయటకు వచ్చేశారను. మూడవ వారం ఎలిమినేషన్ లేకపోయినా వైల్డ్ కార్డు ద్వారా అదే వారం హౌస్ లోకి అడుగుపెట్టిన మిథిలేష్ రెడ్డి బిగ్ బాస్ ఇచ్చిన రూ. 15 లక్షల క్యాష్ ప్రైజ్ తీసుకొని బయటకు వెళ్లిపోయాడు. ఇక నాలుగవ వారం సృష్టి ఎలిమినేట్ కాగా, ఐదవ వారం చరణ్, అపూర్వ ఇద్దరూ ఎలిమినేట్ అయ్యి బయటకు వెళ్లిపోయారు. ఇక ఆరోవారం ఎలిమినేట్ అవుతారన్న దానిపై ఆసక్తి నెలకొంది. మరోవైపు బిగ్ బాస్ టాప్- 5 కంటెస్టెంట్స్ ఎవరు? కప్పు ఎవరు గెలుస్తారు? అన్న విషయాలపై చాలా మంది తమ అభిప్రాయాలను తెలియజేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బిగ్ బాస్ సీజన్ 2 విన్నర్ కౌశల్ మండా బిగ్ బాస్ తెలుగు సీజన్ 10 విన్నర్ ఎవరన్నదానిపై ఒక వీడియో రిలీజ్ చేశాడు.

ఈ వీడియోలో మాట్లాడిన కౌశల్ ఇప్పుడే బిగ్ బాస్ తెలుగు సీజన్ 110 విన్నర్ ఎవరో గెస్ చేయడం చాలా కష్టతరమైన విషయం అని తెలిపారు. ఎందుకంటే ఆడియన్స్ ఎప్పుడు ఎవరికీ ఎలా కనెక్ట్ అవుతారో ఎవరికి తెలియదని తెలిపారు. అయితే మనం ఏదైనా ఒక వీడియో చేస్తే ఆ వీడియో కింద వచ్చే కామెంట్ల ద్వారా మాత్రం మనం టాప్ ఫైవ్ కంటెస్టెంట్లను గెస్ చేయవచ్చని కౌశల్ అంచనా వేశాడు. ఇటీవల తాను పెట్టిన ఒక వీడియో కింద దాదాపు ఒక వెయ్యి వరకు త్రిగుణ్, రోహిత్ గురించే కామెంట్లు వచ్చాయని రోహిత్ వెల్లడించాడు. 'నా అభిప్రాయం ప్రకారం టాప్ 5 కంటెస్టెంట్లుగా త్రిగుణ్, రోహిత్ ఉంటారు. హౌస్ లో కంటెస్టెంట్ గా కొనసాగుతున్న త్రిగుణ్ ప్రస్తుతం నవరసాలు పండిస్తూ తనదైన శైలిలోనే దూసుకుపోతున్నాడు. ఇక కామన్ మ్యాన్ క్యాటగిరిలో భాగంగా హౌస్ లోకి అడుగు పెట్టిన రోహిత్ కూడా టాప్ 5 కంటెస్టెంట్లలో ఒకరుగా ఉంటాడు. అయితే రోహిత్ ఇటీవల ఓ లవ్ ట్రాక్ కారణంగా కాస్త లవ్ లో ఎక్కువగా ఇన్వాల్వ్ అయ్యారేమననిపిస్తోంది. తన సోషల్ లైఫ్ ని కాస్త బ్యాలెన్స్ చేసుకొని గేమ్ మీద కాన్సన్ట్రేషన్ చేస్తే రోహిత్ టాప్ ఫైవ్ లో కచ్చితంగా ఉంటాడు.

## అప్పట్లో ఊపేసింది.. ఇప్పుడు కనిపించకుండా మాయం అయ్యింది



తెలుగు సినీ పరిశ్రమలో కొందరు హీరోయిన్లు తక్కువ సినిమాలే చేసినా ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటారు. అందం, అభినయంతో పాటు తెరపై తమదైన ముద్ర వేస్తారు. అలాంటి నటీమణుల్లో ఒకరు కామ్నా జెఠ్మలానీ. ఒకప్పుడు టాలీవుడ్‌లో వరుస అవకాశాలతో సందడి చేసిన ఈ బ్యూటీ.. గోపీచంద్ హీరోగా నటించిన 'రణం' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. అయితే కొంతకాలం పాటు సినిమాల్లో కనిపించిన ఆమె.. ఆ తర్వాత అనూహ్యంగా వెండితెరకు దూరమయ్యారు. ఇంతకీ ఇప్పుడు ఆమె ఎలా ఉన్నారు? ఏం చేస్తున్నారు? గోపీచంద్ కెరీర్‌లో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న చిత్రాల్లో 'రణం' ఒకటి. అమ్మ రాజశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇందులో గోపీచంద్ సరసన కామ్నా జెఠ్మలానీ హీరోయిన్‌గా నటించారు. తన అందం, నటనతో ప్రేక్షకులను ఆకర్షించిన ఆమెకు ఈ చిత్రం మంచి గుర్తింపును తీసుకొచ్చింది. ఈ సినిమా తర్వాత కామ్నా పేరు టాలీవుడ్‌లో బాగానే వినిపించింది. అయితే 'రణం' మాత్రమే కాకుండా ఇతర తెలుగు సినిమాల్లోనూ ఆమె నటించారు. అల్లరి నరేష్‌తో కలిసి 'బెండప్పారావు ఆర్.ఎం.పి.' సినిమాలోనూ కనిపించారు. గోపీచంద్ కెరీర్‌లో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న చిత్రాల్లో 'రణం' ఒకటి. అమ్మ రాజశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా

Printed, published &owned. By ravula rajesham printed at. JORDAR publication H.NO.2-5_146 . jammikunta.dist. karimnagar Telangana state 505122..editor.ravula rajesham, email. editor jordar@gmail.com. cellphone 7780185674 PRGi numberTG TEL/25/A5224